




నమో.. నారసింహా!

నృసింహ జయంతి సందర్భంగా బుధవారం పెంచలకోన, నెల్లూరు రూరల్ మండలం నరసింహ కొండ తదితర క్షేత్రాల్లో లక్ష్మీనరసింహస్వామికి బంగారు గరుడ వాహనసేవను అంగరంగ వైభవంగా నిర్వహించారు. అలాగే నెల్లూరులోని రంగనాయకులస్వామికి కూడా గరుడసేవ జరిగింది. భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. ఎండలు మండిపోతున్నప్పటికీ చిన్నారులు, మహిళలు, వృద్ధులు పెద్దసంఖ్యలో ఆయా క్షేత్రాలకు చేరుకుని స్వామిసేవలో తరించారు.



సింహ వాహనంపై శ్రీవారు

కమనీయం నృసింహుడి కల్యాణం

- ఆదిలక్ష్మి, చెంచులక్ష్మిలను పెళ్లాడిన వేద గిరీశుడు
- వీక్షణకు తరలివచ్చిన భక్తులు ● జనసముద్రంలా నరసింహకొండ

నెల్లూరు రూరల్, మే 22 : వేదగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వామివారి కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. ముందుగా ఆలయంలోని స్వామి, అమ్మవార్లను ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఆసీనులు చేసి, అలంకరణ మండపానికి తోడ్కొని వచ్చారు. అక్కడ అర్చక బృందం విశేష పూజలు, అభిషేకా లు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను పెళ్లికుమారుడిగా పెళ్లి కుమార్తెలుగా అలంరించి, కల్యాణ మండపంపైకి తీసుకువచ్చారు. అనంతరం ఆలయ అర్చక బృందం వివాహతంతును నిర్వహించారు. ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు పోటీపడ్డారు.కల్యాణ ఘట్టం అనంతరం స్వామి,అమ్మవార్లను గజవాహనంపై ఆసీనులను చేసి ఊరేగించారు. రాష్ట్ర నలుమూల నుంచి తరలివచ్చిన భక్తులతో నరసింహపురంతోపాటు కొండపైన రద్దీ నెలకొంది. భారీగా వాహనాలు చేరుకోవడంతో పార్కింగ్ సమస్య ఏర్పడింది. స్వామి, అమ్మవార్లకు ముందుగా ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలను దేవదాయ శాఖ తరఫున ఆలయ ఈవో గిరికృష్ణ అందచేశారు.

● స్వర్ణ గరుడుడిపై విహారం

బుధవారం వేకువ జామున ఒంటి గంట నుంచి 3 గంటల వరకు ఆలయ పుర వీధుల్లో స్వామివారు బంగారు గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ వేడుకను తిలకించేందుకు భారీగా తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి.



వేదగిరిపై స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు(డక్కిలి), మే 22 : కొండాకోనా ఎటు చూసినా కనుచూపు మేర భక్తులే భక్తులు... ఎవరినోట విన్నా పెంచలో ...పెంచలా... గోవిందా...గోవిందా... నమో.. లక్ష్మీ నారసింహా... అనే నామ స్మరణే. భక్త కోటి పిలుపుతో పెనుశిల నరసింహుడు పరవశించి పోయాడు. పెంచలకోన బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వర్ణమయ కాంతులతో మెరిసి పోతున్న గరుడ్మంతుడిపై నరసింహస్వామి కొలువుదీరి భక్తులను కటాక్షించాడు. తమ ఇలవేల్పు దివ్యస్వరూపాన్ని తిలకించిన భక్తులు ఆనంద డోలికల్లో మునిగి తేలారు.



కొండకోనల్లో నుంచి అమ్మవారి గుడికి వస్తున్న ఉత్సవం

- కొండకోనల్లో మారుమోగిన గోవింద నామస్మరణ
- ఇష్టవాహనంపై ఇలవేల్పు వైభోగం ● వైభవంగా సింహ, గరుడ వాహన సేవలు
- నృసింహ జయంతి సందర్భంగా కోనకు పోటెత్తిన భక్తులు

● కిక్కిరిన కోన

రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలి రావడంతో పెంచలకోన క్షేత్రం కిక్కిరిసిపోయింది. ముందుగా పలువురు భక్తులు తలనీలాలు సమర్పించుకుని, పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు వివిధ సత్రాల్లో అన్నదానం చేశారు. పెద్దసంఖ్యలో జనం తరలి రావడంతో కోనలో ఈ ఏడాది వ్యాపారాలు ఊపందుకొన్నాయి. కాగా పెంచలస్వామి బుధవారం ఉదయం సింహవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అలంకార మండపంలో సింహవాహనాన్ని పూలతో ప్రత్యేకంగా అలంకరించి ఉత్సవమూర్తులను కొలువు దీర్చారు. అర్చకుల విశేష పూజల అనంతరం క్షేత్రోత్సవం నిర్వహించారు. అంతకు ముందు ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం,విశేష పూజలు, హోమాలు కొనసాగించారు. రాత్రికి స్వామివారిని తిరుచ్చి వాహనంపై కొలువు దీర్చి సహస్ర దీపాలంకరణ మండపానికి తరలించా రు. ఉభయ దేవరులతో కలిపి ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం స్వర్ణ గరుడుడిపై స్వామి వారు కోనలో మూడ వీధుల్లో విహరించారు. ఈ కార్యక్రమాల్లో ఏసీ డబ్బుగుంట వెంకటేశ్వర్లు, డీసీ కే విజయసాగర్ సాగరబాబు, ఆలయ ఇన్‌స్పెక్టర్ హరీష్, ప్రధాన అర్చకులు రామయ్యస్వామి, శశికుమార్‌స్వామి, గుండ్లూరు సీతారామయ్య, పెంచలయ్య, బాలాజీ, మధుస్వామితో పాటు టీటీడీ అర్చకులు పాల్గొన్నారు. కాగా, కోనలో గురువారం ఉదయం శ్రీవారి కల్యాణం వేడుకగా నిర్వహించనున్నారు. ఇందుకుగాను మండపాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. రాత్రి 6 గంటలకు రథోత్సవం, అనంతరం గజవాహన సేవ నిర్వహిస్తారు.



గరుడవాహనంపై పెంచల స్వామి



బంగారు గరుడుడిపై రంగడి చిద్విలాసం

నెల్లూరు (సాంస్కృతికం) మే 22: నృసింహ జయంతి సందర్భంగా నెల్లూరులోని తల్పగిరి రంగనాథస్వామి బంగారు గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. గరుడోత్సవం గోపురం వీధి మీదుగా శెట్టిగుంటరోడ్డు, లక్ష్మీపురం వరకు సాగింది. ఉభయదాతలుగా రాజా హజరత్‌బాబు, కుటుంబ సభ్యులు వ్యవహరించారు. నగరవాసులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, సహాయ కమిషనర్ ఈవో ఏవీ శ్రీనివాసులురెడ్డి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నెల్లూరు రూరల్...

- టీడీపీ ఏజెంట్లపై దాడులు
- ఓటర్ల జాబితాల చించివేత

మరో మాచర్ల!

- అంతు చూస్తామని విజయసాయి, ఆదాల బెదిరింపులు ● రూరల్ ఎన్నికల అధికారికి బాధితుల ఫిర్యాదు
- వెబ్ కెమెరాల్లోని దృశ్యాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని వినతి
- ఆలస్యంగా వెలుగు చూస్తున్న వైసీపీ అరాచకాలు


నెల్లూరు, మే22 (ఆంధ్రజ్యోతి): ఓటమి భయంతో వైసీపీ అభ్యర్థులతోపాటు ఆ పార్టీ నాయకులు పోలింగ్ రోజున చేసిన అక్రమాలు, అరాచకాలపై ఎన్నికల అధికారులకు ఆలస్యంగా ఫిర్యాదులు అందుతున్నాయి మాచర్ల ఘటనపై ఎన్నికల కమిషన్ స్పందించిన నేపథ్యంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలో సైతం ఇలాంటి దౌర్జన్యాలు జరిగాయంటూ ఆరుగురు టీడీపీ ఎన్నికల ఏజెంట్లు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో మలోలాకు టీడీపీ ఏజెంట్లు అందచేసిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లూరు నగరంలోని 21వ డివిజన్‌లో కార్పొరేటర్ మోయిల్ల గౌరీ, మోయిళ్ల సురేష్‌రెడ్డి తదితరులు టీడీపీ బూత్ ఏజెంట్లపై దౌర్జన్యం చేయడంతో పాటు ఓటరు జాబితాను చించివేశారని, మీ అంతు చూస్తామని బెదిరించారని ఫిర్యాదు చేశారు. అలాగే నెల్లూరు రూరల్ పరిధిలోని వెంగళరావునగర్ బూత్ నెంబరు 148లో కూడా నెల్లూరు వైసీపీ ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి తనపై దౌర్జన్యం చేశారని, ఓటరు జాబితా చించివేశారని, పరుష పదజాలంతో బెదిరించారని ఆ బూత్ టీడీపీ ఏజెంటు ఆర్వోకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. బొల్లినేని ఆసుపత్రి ఎదురుగా ఉన్న మున్సిపల్ యూపీ స్కూలు బూత్‌లో టీడీపీ ఏజెంటుగా ఉన్న శివపై వైసీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకరరెడ్డి దౌర్జన్యం చేశారని, ఓటర్ల జాబితా చించివేశారని, నీ అంతు చూస్తామని బెదిరించారని బాధితుడు ఫిర్యాదు చేశారు. ఈ దౌర్జన్యాలు, బెదిరింపులు అన్నీ కూడా పోలింగ్ కేంద్రాల్లోని వెబ్ కెమెరాల్లో రికార్డు అయ్యాయని బాధితులు తెలియచేస్తున్నారు. ఎన్నికల అధికారులు తక్షణం స్పందించి పోలింగ్ బూత్‌లోని వెబ్ కాస్టింగ్‌ను పరిశీలించి దౌర్జన్యం చేసిన వైసీపీ నేతలపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

● మాచర్ల ఘటనతో టీడీపీ శ్రేణుల్లో ధైర్యం

పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలో వైసీపీ నాయకులు చేసిన దాడులు, ఈవీఎం మిషన్ల ధ్వంసం సంఘటనలను వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలించిన ఎన్నికల కమిషన్ చర్యలకు ఆదేశించింది.ఈ క్రమంలో నెల్లూరు జిల్లా టీడీపీ శ్రేణుల్లో ధైర్యం వచ్చింది. పోలింగ్ రోజు దౌర్జన్యాలను, బెదిరింపులను ఎదుర్కొన్న టీడీపీ ఏజెంట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు ఫిర్యాదు చేయడం ప్రారంభించారు. ప్రస్తుతం నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి మొదలైన ఈ ఫిర్యాదులు త్వరలో జిల్లా వ్యాప్తంగా పలు నియోజకవర్గాల నుంచి కూడా అందే సూచనలు కనిపిస్తున్నాయి.

వైసీపీ నేతలపై చర్యలు తీసుకోండి

నెల్లూరు (వెంకటేశ్వరపురం): నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని మూడుబూత్‌ల్లో వైసీపీ నాయకులు ఎన్నికల నియమావళి విరుద్ధంగా ఇష్టానుసారంగా ప్రవర్తించారని, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని టీడీపీ బూత్ ఏజెంట్లు శరవణ, మహేష్, శివకుమార్, పవన్, శ్రీనివాసులు, రహీమ్ బుధవారం సాయంత్రం రూరల్ ఆర్వో మలోలకు ఫిర్యాదు చేశారు. ఈనెల 13న పోలింగ్ రోజు నియోజకవర్గంలోని 102, 103 బూత్‌ల్లోకి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, 148వ బూత్‌లోకి వైసీపీ ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి, 184, 185, 186వ బూత్‌ల్లోకి వైసీపీ 21 డివిజన్ కార్పొరేటర్ ఎం గౌరి, ఆమె భర్త సురేష్ రెడ్డి ప్రవేశించి తమ వద్ద ఉన్న ఓటరు జాబితాలను లాగేసి చించి వేశారన్నారు. తమ అంతు చూస్తానని బెదిరించారని, పోలింగ్ బూత్‌లో భయానక వాతావరణం కల్పించి. ప్రజలనుభయభ్రాంతులకు గురి చేశారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారించి వారందరిపై తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



సమాజ సేవ విద్యావంతుల బాధ్యత

- విజ్ఞానం, నైపుణ్యం దేశాభివృద్ధికి సోపానాలు
- న్యాక్ ఏ గ్రేడ్ పొందడం వీఎస్‌యూకి గర్వకారణం

● వీఎస్‌యూ స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్

వెంకటాచలం, మే 22 : విద్యావంతులు సమాజసేవకు తమవంతు సహకారం అందించాలని,పేదరిక నిర్మూలనకు వారి సహకారం ఎంతో అవసరమని రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీ 8,9వ స్నాకోత్సవం బుధవారం అట్టహాసంగా జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకుని అది నేరవేరేందుకు సంకల్పం, పట్టుదల కలిగి ఉండాలన్నారు. పదిహేనేళ్లుగా వీఎస్‌యూ సమాజానికి సేవ చేయడంలో విశేషమైన పురోగతి సాధించిందన్నారు. అత్యుత్తమ న్యాక్ ఏ గ్రేడ్ వర్సిటీ పొందడం గర్వకారణమన్నారు.

● మౌలిక వసతులు భేష్

వీఎస్‌యూలో అత్యాధునిక భవనాలు, ఆధునిక హాస్టళ్లు, ఆకట్టుకునే మెయిన్‌గేట్ ఆర్చి, చక్కగా నిర్వహిస్తున్న అంతర్గత రహదారులతోసహా మౌలిక సదుపాయాలు చాలా బాగున్నాయని గవర్నర్ పేర్కొన్నారు. బుధవారం వర్సిటీ భవన సముదాయాన్ని ఆయన పరిశీలించారు. లైబరీలోని దీపాలు, వాటర్ హీటర్లు, కంప్యూటర్ల కోసం సౌరశక్తిని ఉపయోగించడం, స్మార్ట్ క్లాస్‌రూమ్‌ల ఏర్పాటు, ఆర్‌ఎఫ్‌ఐడీ, ఐఎల్‌ఎంఎస్‌తో లైబ్రరీని డిజిటలైజేషన్ చేయడం వంటివి చేయడం ప్రశంసనీయమన్నారు.

● ఆశావహ ధోరణిలో విద్యార్థులు : సతీష్‌రెడ్డి

మరో ముఖ్య అతిథి, ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ జీ సతీష్‌రెడ్డి మాట్లాడుతూ నేటి విద్యార్థుల్లో ఆశావహ ధోరణి, ఆత్మవిశ్వాసం పెరిగాయని అన్నారు. దేశంలో 1,168 యూనివర్సిటీలు ఉన్నాయని, వాటిల్లో 12.3 కోట్లమంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్టార్టప్, ఆత్మనిర్భర భారత్ వంటి పథకాలను నేటి యువత వినియోగించుకుంటున్నారన్నారు. ప్రముఖ కవితిక్కన ఈ జిల్లాకు చెందినవారేనని, అలాగే డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ కూడా జిల్లాలో చదువుకున్నారని వివరించారు. పూర్వ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు జిల్లా వాసేనని గుర్తు చేశారు. నెల్లూరు జిల్లాలో ఎంతోమంది ప్రముఖులు చదువుకున్నారని ఆయన చెప్పారు.



ఈఎన్‌టీ వైద్యుడు వినయ్‌కుమార్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తున్న గవర్నర్ నజీర్, చిత్రంలో ఏరోనాటికల్ సొసైటీ అధ్యక్షుడు సతీష్‌రెడ్డి, వీఎస్‌యూ వీసీ సుందరవల్లి తదితరులు



అధ్యాపకులతో సమావేశమైన గవర్నర్, వీసీ, సతీష్‌రెడ్డి తదితరులు

● గవర్నర్‌కు ఘనస్వాగతం

వీఎస్‌యూ 8, 9వ స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు వర్సిటీకి విచ్చేసిన గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు వీసీ సుందరవల్లి, కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ ఆరీఫ్ హఫీజ్, జేసీ సేతు మాధవన్, రిజిస్ట్రార్ డాక్టర్ రామచంద్రారెడ్డిలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన పోలీసుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం వర్సిటీ ప్రొఫెసర్లతో గవర్నర్ సమావేశమై, గ్రూప్ ఫొటో దిగారు.

29 మందికి బంగారు పతకాల ప్రదానం

స్నాతకోత్సవంలో 29 మంది విద్యార్థులకు గవర్నర్ బంగారు పతకాలు, డిగ్రీ పట్టాలను అందించారు. అలాగే హైదరాబాద్ అపోలో ఆసుపత్రిలో వైద్య సేవలు అందిస్తున్న ప్రముఖ ఈఎన్‌టీ శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ ఈసీ వినయ్‌కుమార్‌కు డాక్టరేట్ అందచేశారు. ఈ సందర్భంగా గవర్నర్‌ను శాలువాతో సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. అనంతరం 275 మందికి ప్రత్యక్షంగా డిగ్రీ పట్టాలు, పోస్టు ద్వారా 3,361 మందికి డిగ్రీ పట్టాలు అందిస్తున్నట్లు వీసీ సుందరవల్లి తెలిపారు. తొలుత వీసీ వర్సిటీ ప్రగతి, కార్యాచరణ ప్రణాళిక నివేదికను క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి, వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రామచంద్రారెడ్డి, కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ ఆరీఫ్ హఫీజ్, జేసీ సేతుమాధవన్ తదితరులు పాల్గొన్నారు.



బంగారు పతకంతోపాటు గవర్నర్ నుంచి పట్టాలు అందుకుంటున్న విద్యార్థినులు



హుర్రే... పట్టాలు పొందిన ఆనందం

గవర్నర్‌కు వీడ్కోలు

నెల్లూరు(హరనాథపురం): విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో పాల్గొని, విజయవాడకు బయలు దేరిన గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ ఆరీఫ్ హఫీస్, వీసీ సుందరవల్లి, రిజిస్ట్రార్ రామచంద్రారెడ్డి తదితరులు ఘనంగా వీడ్కోలు పలికారు.



గవర్నర్‌కు వీడ్కోలు పలుకుతున్న కలెక్టర్

మాతినవారిపాలెంలో డయేరియా

● వాంతులు,విరోచనాలతో చికిత్స పొందుతూ ఒకరి మృతి
● వారం రోజులుగా మంచం పట్టిన గ్రామస్థులు


అపరిశుభ్రంగా ఉన్న వాటర్ ట్యాంకు పరిసరాలు

కావలి రూరల్, మే 22: కావలి మండలం మాతినవారిపాలెంలో కలుషిత నీరు, పారిశ్యుధ్య లోపంతో డయేరియా వ్యాధి ప్రబలి ఒకరు మృతిచెందగా, సుమారు 25 మంది కావలి, నెల్లూరులోని వివిధ ప్రయివేటు వైద్యశాలల్లో వారం రోజులుగా చికిత్స పొందుతున్నారని గ్రామస్థులు పేర్కొన్నారు. గ్రామానికి చెందిన మన్నెం పొట్టెయ్య(26) వాంతులు విరోచనాలతో పట్టణంలోని ప్రయివేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతిచెందినట్లు మృతుని తల్లి జయమ్మ వాపోయింది. పొట్టెయ్య వాంతులు విరోచనాలతో అనారోగ్యం బారిన పడటంతో ఆర్ఎంపీ వైద్యుని వద్ద చూపించి పరిస్థితి విషమంగా ఉండటంతో పట్టణంలోని ప్రయివేటు వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు జయమ్మ వాపోయింది.

గ్రామంలో లోపించిన పారిశుధ్యం

గ్రామంలో నివాసాల మధ్యనే పేడదిబ్బలు, చెత్తకుప్పలు పేరుకుపోయాయి. మురుగునీటి కాలువలు లేకపోవటంతో పాటు వీధుల్లో చెత్త తొలగింపు చేపట్టక పోవటంతో గ్రామంలో పారిశుధ్యం లోపించినట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామానికి గతంలో తుమ్మలపెంట రక్షిత మంచినీటి పథకం ద్వారా జరుగుతున్న తాగునీటి సరఫరా నిలిపివేయడంతో గ్రామంలోని కొందరు మినరల్ వాటర్ క్యాన్లు కొనుగోలు చేసుకుని తాగుతుండగా, మరికొందరు గ్రామంలోని ఓవర్ హెడ్ ట్యాంకు ద్వారా సరఫరా అయ్యే నీరు తాగుతున్నట్లు తెలిపారు. కాగా, గ్రామానికి నీటి సరఫరా జరిగే ఓవర్ హెడ్ ట్యాంకు చుట్టూ అపరిశుభ్రంగా ఉండటంతో పాటు వాల్వులు ఉండే తొట్టెలు శుభ్రంగా లేకపోవడంతో అసలు ట్యాంకు క్లోరినేషన్ చేస్తున్నారా.. లేదా అన్న అనుమానాలు గ్రామస్థులు వ్యక్తం చెయ్యటంతో హడావిడిగా ట్యాంకును శుభ్రపరిచారు.


ట్యాంకు వద్ద వాల్వులో నిల్వ ఉన్న నీటిలో చెత్త


మృతి చెందిన పొట్టెయ్య (ఫైల్)

కానరాని వైద్యశిబిరాలు

గ్రామంలో గత వారం రోజులుగా వాంతులు, విరోచనాలతో గ్రామస్థులు వణికిపోతున్నప్పటికీ వైద్యులు పట్టించుకోవటం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామంలోని పాఠశాలకు మంగళ, బుధవారాలలో వచ్చిన ఏఎన్ఎంలు టాబ్లెట్లు ఇచ్చి సరిపుచ్చుకున్నారని, కనీసం గ్రామంలో డాక్టర్లచే వైద్యశిబిరం కూడా ఏర్పాటుచెయ్యలేదని, రెక్కాడితే గాని డొక్కాడని పేదలు కావటంతో వైద్యం అందక ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా వైద్యాధికారులు స్పందించి గ్రామంలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఉదయగిరిలో చోరీ

● బంగారు, వెండి వస్తువులతోపాటు నగదు అపహరణ


పరిశీలిస్తున్న ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి

ఉదయగిరి రూరల్, మే 22: ఉదయగిరి పట్టణంలోని బాలాజీనగర్‌లో సొసైటీ సీఈవో రేకలగుంట పోలయ్య నివాసంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన బుధవారం రాత్రి వెలుగు చూసింది. వివరాల మేరకు.. పోలయ్య కంటి శస్త్రచికిత్స కోసం ఈనెల 19వ తేదీ రాత్రి భార్యతో కలిసి తిరుపతి వెళ్లాడు. శస్త్రచికిత్స అనంతరం బుధవారం రాత్రి పోలయ్య దంపతులు ఇంటికొచ్చారు. ఆరుబయట గేటుకు ఉన్న తాళం తీసి ఇంట్లోకి వెళ్లారు. ఇంటి లోపల ఉన్న గ్రిల్స్ తాళం పగలగొట్టి ఉండడాన్ని గమనించి లోపలివెళ్లి పరిశీలించారు. లోపల బీరువా ధ్వంసం చేసి ఉండడం, వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడి ఉండడంతో చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. బీరువాలో ఉన్న రెండున్నర సవర బంగారు నక్లెస్, రెండు జతల బంగారు కమ్మలు, రూ.28 వేలు విలువైన వెండి వస్తువులు, రూ.20 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. గురువారం క్లూస్‌టీం వచ్చి పరిశీలిస్తుందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

15 మంది అనుమానితులు అదుపులోకి..

● కొనసాగుతున్న కార్డన్ సెర్చ్

నెల్లూరు(క్రైం), మే 22: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా పోలీసులు చేపడుతున్న కార్డన్ సెర్చ్ ఆపరేషన్ బుధవారం కొనసాగింది. ఉదయగిరి, ఉలవపాడు, వలేటివారిపాళెం, కలిగిరి, దుత్తలూరు పోలీసు స్టేషన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. సంబంధిత డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొని విస్తృత గాలింపు జరిపారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని 14 బైక్‌లను స్వాధీనం చేసుకుని, 15 మంది అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు.

మోటారు బైక్‌ను ఢీకొన్న ట్రక్కు వాహనం

● ఒకరికి తీవ్ర గాయాలు

ఆత్మకూరు, మే 22: దేపూరు బండారుపల్లి మార్గంలో మోటారు బైక్‌ను ఎదురుగా వస్తున్న ట్రక్కు వాహనం బుధవారం ఉదయం ఢీకొంది. ఈ ఘటనలో మోటారు బైక్ నడుపుతున్న యువకుడు శ్రీనివాసులుకు తీవ్ర గాయాలైయ్యాయి. సమాచారం అందుకున్న 108 వాహనం సిబ్బంది క్షతగాత్రుడ్ని ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గొర్రెల చోరీ ముఠా పోలీసులకు అప్పగింత

వరికుంటపాడు, మే 22: మండలంలో గొర్రెలను అపహరించేందుకు వచ్చిన ఓ ముఠాను స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించిన సంఘటన బుధవారం చోటుచేసుకొంది. వివరాల మేరకు.. మండలంలోని ఇస్కపల్లి చవటవాగు సమీపంలో గొర్రెలు మేత మేస్తుండగా ఆటోలో కొంతమంది అటువైపు వచ్చి ఓ గొర్రెను అపహరించుకెళ్లారు. గమనించిన జీవాల యజమాని సుబ్బారావు స్థానికులను అప్రమత్తం చేశారు. వారిని పట్టుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడ గ్రామ వడ్డిపాళెంకు చెందిన గోవింద్, మోహన్, గణేష్, దుర్గతోపాటు ఆటోను పోలీసులకు అప్పగించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు జీవాల యజమానులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఇటీవల తమ గొర్రెలను అపహరించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుపతయ్య తెలిపారు.

ముళ్లపొదల్లోకి దూసుకెళ్లిన లారీ

సంగం, మే 22: దువ్వూరు సమీపంలో ముంబాయి జాతీయ రహదారిపై ఐరన్ లోడ్‌తో వెళ్తున్న లారీ బుధవారం అదుపుతప్పి ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లింది. వివరాల మేరకు. బళ్లారి నుంచి ఐరన్ లోడ్‌తో కృష్ణపట్నం వెళ్తున్న లారీ ముందు వెళ్తున్న వాహనాన్ని క్రాస్ చేయబోయి ఈ సంఘటన జరిగింది. ఈ సమయంలో ఎదురుగా ఎలాంటి వాహనాలు రాకపోవడంతో ప్రమాదం తప్పడంతో లారీ డ్రైవర్ ఊపిరి పీల్చుకున్నాడు. ఈ సంఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.


రోడ్డు పక్కకు దూసుకువెళ్లిన లారీ

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	172
లేయర్ లైవ్	120
స్కిన్ చికెన్	300
స్కిన్‌లెస్	330
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7056
వెండి కిలో ధర	రూ. 95,700
వెండి ఒక గ్రాము	రూ. 97.70

రాయితీలో కోత.. రైతన్నకు వాత!

పంటల సాగులో అధిక దిగుబడులు సాధించాలంటే భూమి సారవంతంగా ఉండాలి. ఇందుకోసం పచ్చిరొట్ట పైర్లను వేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు రైతులకు సూచిస్తుంటారు. అయితే ఆయా విత్తనాల ధరలు క్రమేపీ పెంచడంతో పాటు రాయితీలు తగ్గిస్తుండటంతో రైతులపై అదనపు భారం పడుతోంది.

పచ్చిరొట్ట విత్తనాలకు 50శాతమే రాయితీ ● గతేడాది కంటే పెరిగిన ధరలు

ఖరీఫ్ ఆరంభంలోనే అన్నదాతపై అదనపు భారం



నెల్లూరు (వ్యవసాయం), మే 22 : వర్షాలు కురిసిన వెంటనే భూసారం పెంచుకునేందుకు రైతులు తమ పొలాల్లో పచ్చిరొట్ట విత్తనాలు వేసుకుంటారు. పచ్చిరొట్ట పైర్లలో ఎన్నో రకాలు ఉన్నా జనుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాలనే రైతులు అధికంగా వినియోగిస్తుంటారు. భూమికి అవసరమైన సేంద్రియ సత్తువ అందించేందుకు ఈ పచ్చిరొట్ట ఎరువులు ఎంతో ఉపయోగపడతాయి. ఈ పైరు ఏపుగా పెరిగి పూత దశకు చేరుకున్న తరువాత పొలంలోని మట్టిలో కలియదున్నేసుకుంటారు. దీంతో పంటకు అవసరమైన పోషకాలు విడుదల అవుతాయి. అంతేగాక నేలకు భౌతిక, జీవ సంబంధ ప్రయోజనం కలుగుతుంది.

● **రాయితీలో కోత**

జిల్లాలో దాదాపు 5 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తుంటారు. అయితే నేల సారవంతమయ్యేందుకు పంట సాగుకు ముందు పచ్చిరొట్ట పైర్ల సాగు చేస్తారు. దీనివల్ల ఎరువుల వినియోగం తగ్గుతుంది. తద్వారా రైతుకు పెట్టుబడి వ్యయం కొంతమేర తగ్గుతుంది. ఇంతటి ప్రాధాన్యం ఉన్న పచ్చిరొట్ట విత్తనాలను టీడీపీ ప్రభుత్వం 75శాతం రాయితీతో అందించేది. వైసీపీ అధికారంలోకి వచ్చాక 50 శాతానికి తగ్గించేశారు. దీంతో విత్తన ఖర్చులో 25శాతం రైతులపై అదనపు భారం పడింది. దీనికితోడు గతేడాదితో పోలిస్తే పచ్చిరొట్ట విత్తనాల ధరలు కూడా పెరిగిపోయాయి.

● **రైతులపై అదనపు భారం**

పచ్చిరొట్ట విత్తనాల ధరను వైసీపీ సర్కారు క్రమేపి పెంచేసింది. గతేడాది ధరలతో పోలిస్తే కిలో విత్తనంపై దాదాపు రూ.4 నుంచి రూ.31 వరకు పెరిగింది. గతేడాది 50శాతం సబ్సిడీపోను జీలుగ విత్తనాలు కిలో రూ.39.50 ఉండగా, ప్రస్తుతం రూ.44లుగా నిర్ధారించారు. అ దేవిధంగా జనుము రూ.42 నుంచి రూ.44లకు, పిల్లిపెసర కిలో రూ.48.50 నుంచి రూ.67లకు పెరిగింది. భూమి పరిస్థితిని బట్టి రైతులు ఎకరాలకు కనీసం 8కిలోల నుంచి 10కిలోల వరకు వినియోగిస్తుంటారు. ఫలితంగా ప్రస్తుత ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే రైతులపై అదనపు భారం పడనుంది.

పేర్లు రిజిస్టర్ చేసుకోవాలి

భూసారం పెంచుకునేందుకు పచ్చిరొట్ట పైర్లు ఎంతో ఉపకరిస్తాయి. 8,728 క్వింటాళ్ల జనుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. ఈ విత్తనాలు అవసరమైన రైతులు ముందుగా తమ పేరు రిజిస్టర్ చేయించుకోవాలి. అవసరాన్ని బట్టి ఎన్ని క్వింటాళ్లయినా ఇచ్చేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఎరువుల వాడకం తగ్గించడం, ప్రకృతిలో లభించే సేంద్రియ ఎరువుల వాడకం, భూసార పరిరక్షణలపై రైతులకు అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నాం.

- పీ సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి

సోమశిలలో 7.66 టీఎంసీలు

అనంతసాగరం, మే 22: సోమశిల జలాశయం పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు. బుధవారానికి 7.640 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు వివరించారు.

అంగన్‌వాడీల పర్యవేక్షణ బాధ్యత మీదే !

● ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్

నెల్లూరు (వీఆర్సీ), మే 22 : అంగన్‌వాడీ కేంద్రాలను ప్రతిరోజూ తనిఖీ చేయాలని, అంగన్‌వాడీ కేంద్రాలు తెరువకపోయినా, పిల్లలకు ఆహారం అందించకపోయినా బాధ్యత మీదేనంటూ మహిళ, శిశు సంక్షేమ శాఖ పీడీ హేనాసుజన్ సీడీపీవో, సూపర్‌వైజర్లను హెచ్చరించారు. 'అందని పౌష్టికాహారం' శీర్షికతో ఇటీవల ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం ప్రచురించిన నేపథ్యంలో నెల్లూరులోని మహిళా ప్రాంగణంలో అత్యవసరంగా రెండు రోజుల సమీక్ష సమా వేశాన్ని పీడీ నిర్వహించారు. తొలిరోజు బుధవారం కొన్ని ప్రాజెక్టుల సీడీపీవో, సూపర్‌వైజర్లతో సమావేశమయ్యారు. కొంతమంది స్వార్థపరుల వల్ల శాఖకే చెడ్డపేరు వస్తోందని, అలాంటి వారిపై నిఘా ఉంచుతామని స్పష్టం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలు తెరువక పోయినా , పిల్లలకు మెనూ ప్రకారం భోజనం, పాలు, గుడ్లు అందించకపోయినా చర్యలు తప్పవన్నారు. ఈ నెలలో 15 రోజులు టీచరుకు, 15 రోజులు ఆయాలకు బాధ్యతు అప్పగించామని చెప్పారు. సూపర్‌వైజర్లు ప్రతి రోజూ కొన్ని సెంటర్లు తనిఖీ చేసి, వాటి ఫొటోలను పంపించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కోవూరు, ఇందుకూరుపేట, రాపూరు, నెల్లూరు, ఉలవపాడు, కందుకూరు సీడీపీవోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాల ప్రారంభం

1 వరకు తొలివిడత అడ్మిషన్లు


డీకేడబ్ల్యూ కళాశాలలో అడ్మిషన్ పొందిన విద్యార్థినికి ధ్రువీకరణ పత్రం అందచేస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

నెల్లూరు (విద్య), మే 22 : జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. బుధవారం నుంచి జిల్లాలో దరఖాస్తుల స్వీకరణ మొదలైంది. 2024-25 విద్యా సంవత్సరానికి ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్‌లోనే నేరుగా కళాశాలల ద్వారానే ఎంపికలు చేపడుతున్నారు. బుధవారం నుంచి తొలి విడత అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించగా జూన్ 1 వరకు కొనసాగనుంది. జూన్ 10 నుంచి రెండో విడత అడ్మిషన్లు జరుగుతాయి. అడ్మిషన్ల విధానంలో కచ్చితంగా రిజర్వేషన్లు పాటించాలని ఆర్ఐవో డాక్టర్ ఏ శ్రీనివాసులు ఆదేశించారు. ఏ కళాశాల కూడా మంజూరుకు మించి ప్రవేశాలు చేపట్టకూడదని, మొత్తం సీట్లలో 3వ వంతు బాలికలకు కేటాయించాలని సూచించారు. జనరల్ గ్రూపుల్లో ప్రతి సెక్షన్‌కు 88 మందికి, ఒకేషనల్, పారామెడికల్ కోర్సుల్లో 30 మందికి, నాన్ పారా మెడికల్ కోర్సుల్లో 40 మందికి గరిష్ఠంగా ప్రవేశాలు కల్పించాలన్నారు. కోర్సులు, ఫీజుల వివరాలతో బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రిన్సిపాళ్లను ఆదేశించామని పేర్కొన్నారు. ఇంటర్‌బోర్డు ఆదేశాలు, నిబంధనలు పాటించని కళాశాలలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

'డీకేడబ్ల్యూ'లో ప్రవేశాలు...

నెల్లూరులోని డీకే ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బుధవారం అడ్మిషన్లు ప్రారంభించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ శ్రీనివాసులు మాట్లాడుతూ జనరల్ విభాగంలో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులు, తెలుగు మీడియంలో హెచ్ఈసీ గ్రూపు, ఒకేషనల్ విభాగంలో బీఆర్ఎం, సీజీటీ, సీఎస్ఈ, ఎంఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. హాస్టల్ సదుపాయం కూడా ఉందని తెలిపారు. అతిథిగా హాజరైన జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి వై వెంకటయ్య అడ్మిషన్లు పొందిన విద్యార్థినులను అభినందించి కళాశాలలో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రైవేటు ట్రావెల్ బస్సు బోల్తా

● డ్రైవరు దుర్మరణం ● పదిమందికి తీవ్ర గాయాలు



బోల్తాపడిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు, ప్రమాదానికి గురైన వాహనాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

చిత్రగుంట (అల్లూరు), 22 : ప్రైవేటు ట్రావెల్ బస్సు బోల్తాపడి డ్రైవరు దుర్మరణం చెందగా పదిమందికి తీవ్ర గాయాలైన సంఘటన దగదర్తి మండలం సున్నపుబట్టి జాతీయ రహదారిపై బుధవారం వేకువన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. విజయవాడ వైపు నుండి చెన్నైకి వెళ్తున్న ఏపీ 16 టిజె 6838 నెంబరు గల స్లీపర్ కోచ్ ప్రైవేటు ట్రావెల్ బస్సు సున్నపుబట్టికి చేరుకునేసరికి డ్రైవరు మేక శీను (61) నిద్రమత్తులో జారుకున్నాడు. దీంతో అదుపుతప్పిన బస్సు డివైడర్ పైకి ఎక్కి అవతలి వైపు చెన్నై నుండి విజయవాడ వైపు వెళ్తున్న కంటైనర్ లారీని ఢీకొని బోల్తా పడింది. ఈ ఘటనలో శీను అక్కడికక్కడే మృతిచెందగా పదిమందికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హైవే సిబ్బంది, దగదర్తి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను అంబులెన్సుల సహాయంతో నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మేక శీను మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని వద్ద ఉన్న ఆధార్ కార్డును బట్టి విజయవాడకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. కాగా, రెండో డ్రైవరు దాకుమారి శీను తెలిపిన సమాచారం ప్రకారం కావలి మండలం గౌరవరం వరకు తాను డ్రైవింగ్ చేశానని, నిద్ర వస్తుండడంతో మేక శీనుకు స్టీరింగ్ అప్పచెప్పి తాను నిద్రపోయానని, కొంతసేపటికే పెద్ద శబ్దంతో తాను కింద పడిపోయానని లేచి చూసేసరికే శీను తీవ్ర గాయాలపాలై కదలకుండా పడి ఉన్నాడని తెలిపాడు. మృతునికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారని సమాచారం. సంఘటనా స్థలాన్ని కావలి రూరల్ సీఐ నాగభూషణం, అల్లూరు ఎస్ఐ శ్రీనివాసులురెడ్డిలు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

మైనార్టీ గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (వీఆర్సీ), మే 22: జిల్లాలోని మైనార్టీ గురుకులంలో 2024-25 విద్యా సంవత్సరానికి ప్రవేశం కోసం అర్హులైన విద్యార్థులు (బాలురు) దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎలాంటి ప్రవేశ పరీక్ష లేకుండా 5,6,7,8 తరగతుల్లో నేరుగా అడ్మిషన్ పొందవచ్చని తెలిపారు. దరఖాస్తులను నేరుగా పాఠశాలలో సమర్పించాలని సూచించారు. ముస్లిం మైనార్టీ, క్రిస్టియన్, బౌద్ధ, సిక్కుల పిల్లలు మాత్రమే అర్హులని తెలిపారు. ధ్రువీకరణ పత్రాలను మండల విద్యాశాఖాధికారి కౌంటర్ సంతకంతో సమర్పించాలని కోరారు. విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం లక్ష రూపాయలలోపు ఉండాలని, పూర్తి చేసిన దరఖాస్తులను నెల్లూరు ఆటో నగర్‌లోని మైనార్టీ గురుకుల పాఠశాలలో ఈనెల 31లోగా సమర్పించాలని తెలిపారు. పూర్తి వివరాలకు 8712625045ను సంప్రదించాలని కోరారు.

స్ట్రాంగ్ రూములను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ


కంట్రోల్ రూమును పరిశీలిస్తున్న కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం), మే 22 : నెల్లూరు రూరల్‌లోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూములను కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ మంగళవారం పరిశీలించారు. స్ట్రాంగ్ రూములను సీసీటీవీల ద్వారా మానిటరింగ్ చేస్తున్న కంట్రోల్ రూమ్‌ను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కోవూరు ఆర్వో సేదు మాధవన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు డీఎడ్ ప్రవేశ పరీక్ష

నెల్లూరు (విద్య), మే 22 : డీఈడీ కోర్సులో ప్రవేశానికి సంబంధించిన పరీక్షను శుక్రవారం నిర్వహిస్తున్నట్లు డీఈవో రామారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నెల్లూరు సమీపంలోని పొట్టేపాళెం గ్రామంలో గల ఐయాన్ డిజిటల్ జోన్‌లో ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని, అభ్యర్థులు నిర్ణీత సమయం కంటే గంట ముందుగానే పరీక్ష కేంద్రంలో హాజరు కావాలని కోరారు.

25న ఏపీపీఎస్సీ డిప్యూటీ ఈవో పరీక్ష

నెల్లూరు (హరనాథపురం); మే 22 : ఏపీపీఎస్సీ ద్వారా ఏపీ ఎడ్యుకేషన్ సర్వీసెస్‌లో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి రాత పరీక్షను ఈనెల 25న నిర్వహిస్తున్నట్లు డీఆర్వో లవన్న ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కావలిలోని పీబీఆర్ విశ్వోదయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ, కోవూరు మండలం గంగవరంలో ఉన్న గీతాంజలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, నెల్లూరులోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాల, నరసింహకొండ రోడ్డులో ఉన్న ఐయాన్ డిజిటల్ జోన్‌లో ఈ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు జరిగే పరీక్షకు అభ్యర్థులను ఉదయం 7.30 నుంచి 8.30 గంటల వరకు మాత్రమే కేంద్రాల్లోకి అనుమతిస్తారని, అభ్యర్థులు సకాలంలో హాజరుకావాలని సూచించారు.

రేపటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

నెల్లూరు (విద్య), మే 22 : ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి జరుగుతాయని, వీటిని కట్టుదిట్టంగా నిర్వహించాలని ఆర్ఐవో డాక్టర్ ఏ శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం నెల్లూరులోని కేఏసీ ప్రభుత్వ కళాశాలలో పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్లు, కస్టోడియన్లతో ఆయన సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 51 పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం పరీక్ష సామగ్రిని సంబంధిత కేంద్రాలకు అందచేశారు. ఈ సమావేశంలో డీవీఈవో మధుబాబు, డీఈసీ సభ్యులు దీనదయాళ్, వేణుగోపాల్, కొండయ్య పాల్గొన్నారు.

కనుల పండువగా సీతారాముల కల్యాణం


సీతారామపురం : సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


కొండాపురం: గుడవళ్ళూరులో హనుమంత వాహనంపై ఊరేగుతున్న సీతారాములు

సీతారామపురం, మే 22: మండలంలోని దేవిశెట్టిపల్లి గ్రామంలో సీతా సమేత ప్రసన్న కోదండ రామస్వామి ఉత్సవాల్లో భాగంగా బుధవారం సీతారాముల కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కల్యాణం తిలకించారు. అనంతరం స్వామివార్లను ప్రత్యేక వాహనంలో గ్రామోత్సవం నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

కొండాపురం: నృసింహ జయంతిని పురస్కరించుకొని మండలంలోని పలుగ్రామాల్లో ఆలయాల వద్ద గ్రామస్థులు ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం పార్లపల్లి, నేకునాంపేట, గుడవళ్ళూరు, కొమ్మి, వెలిగండ్ల తదితర గ్రామాల్లో రామాలయాల వద్ద జరిగిన పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. గ్రామాల్లో ఆలయాల వద్ద భక్తుల సౌకర్యార్థం నిర్వాహలు అన్నసంతర్పణ కార్యక్రమాలను ఏర్పాటుచేశారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసు శాఖ ఆదేశాల మేరకు ఆలయాల వద్ద ఎటువంటి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించకుండా కేవలం పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఉదయగిరి రూరల్: మండలంలోని పప్పులవారిపల్లి గ్రామంలో శ్రీకోదండరామస్వామి ఉత్సవాల్లో భాగంగా బుధవారం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ వేదికకు తీసుకొచ్చారు. అనంతరం శాస్త్రోక్తంగా స్వామివార్ల కల్యాణ తంతు నిర్వహించారు. అనంతరం స్వామివారి గ్రామోత్సవాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి గ్రామంతోపాటు పరిసర గ్రామాల భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించి కాయాకర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పడకేసిన పారిశుధ్యం

● పట్టణంలో పేరుకుపోయిన చెత్తాచెదారం


సాయిబాబా ఆలయం వీధిలో ఉన్న చెత్తా చెదారం

కావలి, మే 22: అధికారుల పర్యవేక్షణ లోపంతో కావలి పట్టణంలో పారిశుధ్యం పడకేసింది. రోడ్లపై చెత్తా చెదారాలు సకాలంలో తొలగించకపోవడం, కాలువలలో మురుగు కూడా సక్రమంగా తీయకపోవడంతో పరిసరాలు అపరిశుభ్రతగా ఉండటమే కాక దుర్గంధం వెదజల్లుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాయిబాబా గుడికి వెళ్లే వీధిలో ఫారెస్ట్ కార్యాలయం పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర చెత్తాచెదారం కుప్పగా వేసి ఉంది. పొరపాటున ఎవరైనా ఆ చెత్త కుప్పకు నిప్పంటిస్తే ట్రాన్స్‌ఫార్మర్ కూడా కాలిపోయే ప్రమాదం ఉంది. అలాగే కొత్త మసీద్ వీధిలో డ్రైనేజి చెత్తతో పూడిపోవటంతో మురుగు నీరు ముందుకు సాగక దుర్వాసన వెదజల్లుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పట్టణంలో పారిశుధ్యం మెరుగుదలకు తగు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

భూసార పరిరక్షణపై రైతులకు అవగాహన అవసరం


ఉదయగిరి: రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి

ఉదయగిరి, మే 22: రసాయనిక ఎరువుల నుంచి పంటను, భూమిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి రైతుపై ఉందని మండల వ్యవసాయాధికారి ఆంజనేయులునాయక్ తెలిపారు. బుధవారం గండిపాళెం, గుడినరవ, అప్పసముద్రం ఆర్‌బీకేల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఈనెల 28వ తేదీ వరకు భూసార పరిరక్షణపై అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయం, పచ్చిరొట్ట, నానో జీవ సంబంధిత ఎరువుల వాడకంతో భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. దీంతో ఆరోగ్యంతోపాటు పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చన్నారు. రైతులు 50 శాతం సబ్సిడీపై పంపిణీ చేసే ఎరువులు, విత్తనాలను ఆర్‌బీకేల ద్వారా పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జీవ వైవిధ్య కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: చోర్లోయడవల్లి రైతుభరోసా కేంద్రం పరిధిలోని రైతులకు పీఎం ప్రణం పథకం క్రింద సమగ్ర పోషక యాజమాన్యంతో పాటు, భూసార పరిరక్షణపై బుధవారం ఆత్మకూరు సహాయ వ్యవసాయ సంచాలయకులు దేవసేనమ్మ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పంటల సాగులో రసాయన ఎరువులను విచ్చలవిడిగా వాడకుండా, భూసార పరీక్షలకు అనుగుణంగా వాడటంతో పాటు సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులైన పీఎస్‌బీ అజోస్పైరిల్లంలను తప్పనిసరిగా వాడాలన్నారు. ఇలా చేసే సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చన్నారు. అనంతరం మండల వ్యవసాయాధికారి కిషోర్ మాట్లాడారు. నేల ఆరోగ్య పరిరక్షణకు ప్రతి రైతు తప్పనిసరిగా సబ్సిడీతో అందించే పచ్చిరొట్ట ఎరువు అయిన జీలుగ, జనుము, పిల్లిపెసర సాగు చేసి పూత దశలో కలియ దున్నితే భూమి సారవంతమవుతుందన్నారు. కార్యక్రమంలో వీఏఏ శ్రీహర్ష, రైతులు పాల్గొన్నారు.

లింగసముద్రం: పంటల సాగులో రైతులు సేంద్రీయ ఎరువులు వినియోగించాలని మండల వ్యవసాయ అధికారి టి అబ్రహాంలింకన్ సూచించారు. బుధవారం ఆయన మండలంలోని పెదపవని-2, చినపవని రైతు భరోసా కేంద్రాలలో పీఎం ప్రణామ్ కార్యక్రమం కింద రైతులకు సేంద్రీయ ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. రైతులు భూసార పరిరక్షణకై జీవన ఎరువులతో పాటు సేంద్రీయ ఎరువులు వాడాలన్నారు. రైతులు రసాయనిక ఎరువులు ఎక్కువగా వాడటం వలన భూమిలో పండించే పంటల ద్వారా వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని, పర్యావరణం దెబ్బతింటుందని, దీనిని దృష్టిలో ఉంచుకొని రైతులు సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు, వీఏఏలు షేక్ ఇమ్రాన్ నజీర్, అఫ్రిన్ పాల్గొన్నారు.

వెంగయ్యగారిపాలెంలో పోలీసుల తనిఖీలు


పోలీసులు స్వాధీనం చేసుకున్న కత్తులు, రాడ్లు

కావలి రూరల్, మే 22: కావలి పట్టణం వెంగయ్యగారిపాలెంలో బుధవారం 1వ పట్టణ పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎన్నికల కౌంటింగ్ సమయంలో ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు ఉన్నతాధికారుల ఆదేశానుసారం ముందస్తు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు 1వ పట్టణ సిఐ రాజేష్ తెలిపారు. ఈ తనిఖీలలో ఎలాంటి పత్రాలు లేని 8 బైకులు, 2 కత్తులు, 9 రాడ్లు స్వాధీనం చేసుకుని విచారిస్తున్నట్లు సిఐ తెలిపారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి


మరుగుదొడ్ల పనులు పరిశీలిస్తున్న ఎంఈవోలు

ఉదయగిరి రూరల్, మే 22: మనబడి నాడు-నేడు పథకం రెండో విడత జరుగుతున్న పాఠశాలల మరమ్మతు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంఈవోలు షేక్ మస్తాన్‌వలి, తోట శ్రీనివాసులు పేర్కొన్నారు. వారు బుధవారం మండలంలోని కుర్రపల్లి, బోడబండ, జీ.చెరువుపల్లి హరిజనవాడ ప్రాథమిక, బిజ్జంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించి పనులు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు టీ వెంటేశ్వర్లు, షేక్ ఖాదర్‌బాషా, టీ సుభాషిని, మాల్యాద్రి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత


పోలీస్‌స్టేషన్‌లో ఉన్న ఇసుక ట్రాక్టర్లు

లింగసముద్రం, మే 22 : మండలంలోని వీఆర్‌కోట గ్రామ సమీపంలోని మన్నేరువాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను లింగసముద్రం పోలీసులు పట్టుకున్నారు. బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు అందిన సమాచారం మేరకు ఎస్‌హెచ్‌ఓ ఎ మల్లికార్జునరావు సిబ్బందితో దాడిచేసి మన్నేరులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను, నలుగురు డ్రైవర్లను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నలుగురు డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్టు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

546 పొగాకు బేళ్లు కొనుగోలు

కలిగిరి, మే 22: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి బుధవారం రైతులు మొత్తం 601 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 15కంపెనీ ప్రతినిధులు పాల్గొని 546 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-10, సీఆర్-23, జంపింగ్ లాట్స్-22 కారణాలతో 55 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.320, కనిష్ఠ ధర రూ.205, సగటు ధర రూ.269.71గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

కందుకూరు, మే 22: పట్టణంలోని కోవూరు రోడ్డులో ఉన్న స్వర్ణ స్వయంకృషి మానసిక దివ్యాంగుల పాఠశాలలో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశం కోసం జూన్ 15వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల కరస్పాండెంట్ సిహెచ్ సుబ్బారెడ్డి తెలిపారు. 6 నుంచి 23 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన తెలివితేటలు లేని పిల్లలు, పుట్టుక నుంచి మాటలు రానివారు, స్వంతంగా పనులు చేసుకోలేనివారికి ఉచితంగా విద్యాభ్యాసంతో పాటు ప్రత్యేక శిక్షణ, మాటలు నేర్పించటం జరుగుతుందని తెలిపారు. పెద్దపిల్లలకు వృత్తివిద్య శిక్షణలో భాగంగా స్పైరల్ బైండింగ్ నేర్పిస్తామని తెలిపారు. చెవిటి, మూగ పిల్లలకు 1నుంచి 9వ తరగతి వరకు విద్యను అందించటం జరుగుతుందన్నారు. అర్హత కలిగిన విద్యార్థినీ, విద్యార్థులకు ఉచిత హాస్టల్ వసతితో పాటు పట్టణ పరిసర గ్రామాలవారైతే ఉచిత వ్యాన్ సౌకర్యం కూడా ఉందని ఆయన తెలిపారు. వివరాలకు 9492119828 నెంబరులో సంప్రదించాలని కోరారు.

ప్రతిభా పురస్కారాలకు పేర్లు నమోదు చేసుకోండి

కావలిటౌన్, మే 22: యాదవ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన నెల్లూరులో యాదవ విద్యార్థుల ప్రతిభా పురస్కారాల మహోత్సవం జరగనున్నట్లు ఎపా కావలి డివిజన్ కన్వీనర్ గోరంట్ల రమణయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా కందుకూరు డివిజన్ పరిధిలో పది పరీక్షల్లో ప్రతిభ చాటి 475 ఆపైన మార్కులు సాధించిన యాదవ విద్యార్థులకు నెల్లూరు అపోలో హాస్పిటల్ ఎదురుగానున్న జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఉదయం 8గంటల నుంచి ప్రతిభా పురస్కార మహోత్సవం జరగనుందన్నారు. ఆసక్తిగల యాదవ విద్యార్థులు 9492007309 నెంబర్‌కు సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

30వ వార్డులో సమస్యలు పరిష్కరించాలి

● మున్సిపల్ కమిషనర్‌కు టీడీపీ నేతల వినతి


వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నేతలు

కావలి, మే 22: కావలి పట్టణ 30వ వార్డులోని సమస్యలను పరిష్కరించాలని ఆ వార్డు ఇన్‌చార్జి గాదంశెట్టి వేణుగోపాల్ ఆధ్వర్యంలో టీడీపీ నేతలు బుధవారం కావలి మున్సిపల్ కమిషనర్ ఐ శ్రావణ్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందచేశారు. ఆ వార్డులోని కోటావారివీధిలోని నరేంద్ర భారతి స్కూల్ పక్కన రెండు ఖాళీ స్థలాలలో పిచ్చిమొక్కలు పెరిగి అపరిశుభ్రంగా ఉందని, దీంతో విష పురుగులు సమీప ఇళ్లలోకి వెళ్తుండటంతో ప్రజలు భయభ్రాంతులకు గురౌతున్నారన్నారు. దీనిపై స్పందించిన కమిషనర్ తగు చర్యలు తీసుకుంటానని చెప్పినట్లు వారు తెలిపారు.

వర్షాలతో పులకరిస్తున్న వెలుగొండ అడవులు


పచ్చదనం సంతరించుకున్న వెలుగొండ అడవులు

ఉదయగిరి రూరల్, మే 22: వర్షాలు కురుస్తుండడంతో వెలుగొండ అడవులు పచ్చదనంతో ఆహ్లాదకర వాతావరణాన్ని పంచుతున్నాయి. ఉదయగిరి, ఆత్మకూరు, రాపూరు, వెంకటగిరి ప్రాంతాల్లో వెలుగొండ అడవులు విస్తరించి ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో వెలుగొండ అడవుల గుండా వాహనాల్లో వెళ్తున్న ప్రయాణికులు ఆ సోయగాలను చూసి ఆనందపరవశులవుతున్నారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు


గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న ఏఆర్వో, ఎస్ఐ

ఉదయగిరి రూరల్, మే 22: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున గ్రామాల్లో వివాదాలకు పాల్పడి అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పవని ఉదయగిరి నియోజకవర్గ ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి నెస్రూరాబాబు, ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి హెచ్చరించారు. బుధవారం మండలంలోని గంగిరెడ్డిపల్లి గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. వచ్చేనెల 4న ఎన్నికల కౌంటింగ్ ఉన్నందున 6వ తేదీ వరకు కోడ్ అమల్లో ఉంటుందన్నారు. ప్రతిఒక్కరూ జాగ్రత్తగా వ్యవహరించడంతోపాటు గ్రామాల్లో శాంతియుతంగా ఉండాలన్నారు. గ్రామాల్లో ఎలాంటి వివాదాలు తలెత్తినా సమాచారం అందించాలన్నారు. అలాగే స్థానిక బీసీ కాలనీలో ఎస్ఐ కార్డన్‌సర్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీసు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలి

సంగం, మే 22: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తహసీల్దారు రమదేవి వీఆర్వో, వీఆర్ఏలకు ఆదేశించారు. బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఆమె వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలింగ్ రోజు చెన్నవరపాడులో మహిళ ఓటు విషయంపై ఇరువర్గాలు ఘర్షణ పడ్డారని, కౌంటింగ్ పూర్తయ్యే వరకు అలాంటి సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడైనా గొడవలు జరుగుతాయని ముందస్తు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

'హంస' కార్యవర్గం ఎంపిక

ఉదయగిరి రూరల్, మే 22: స్థానిక పాత సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (హంస) జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్, జనరల్ సెక్రటరీ కమల్‌కిరణ్‌ల అధ్యక్షతన జిల్లా ఉపాధ్యక్షులు కప్పా నారాయణరాజు, షేక్ జలీల్‌అహ్మద్‌ల ఆధ్వర్యంలో బుధవారం ఉదయగిరి తాలుకా నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. తాలుకా యూనిట్ అధ్యక్షుడిగా కె వెంకటసుబ్బయ్య, అసోసియేట్ అధ్యక్షుడిగా ఓంకారం శేఖర్‌రాజు, తాలుకా సెక్రటరీ, ట్రెజరర్‌లుగా షేక్ నౌషాద్‌బాబు, పిక్కిలి హసనయ్య, ఆర్గనైజింగ్, పబ్లిసిటి సెక్రటరీలుగా షేక్ బీబీజాన్, ఆకుమల్ల శ్రీనివాసులను ఎంపిక చేశారు. అనంతరం ఉపాధ్యక్షులు, జాయింట్ సెక్రటరీలు, వీసీ మెంబర్లను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వినీత, షంషద్దీన్, సల్మా, వైద్యఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

● నలుగురికి తీవ్ర గాయాలు ● బాధితులు ప్రకాశం జిల్లా వాసులు


మృతిచెందిన వెంకటేశ్వర్‌రెడ్డి

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), మే 22: మండలంలోని చింతలకుంట గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరో నలుగురికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకొంది. ప్రకాశం జిల్లా సీఎస్‌పురం మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు కారులో తిరుమల వెళ్లారు. అక్కడ స్వామివారి దర్శనం అనంతరం తిరిగి వస్తుండగా చింతలకంట గ్రామ సమీపానికి రాగానే మార్కాపురం నుంచి చిత్తూరుకు వెళుతున్న పాల లారీని వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న పాలగిరి వెంకటేశ్వర‌రెడ్డి(30) అక్కడికక్కడే మృతిచెందాడు. కారులో ఉన్న మృతుని భార్య మంజులత, తండ్రి సుబ్బారెడ్డి, తల్లి నారాయణమ్మ, అక్క కుమారుడు అభిరూప్‌నందన్‌రెడ్డిలకు తీవ్ర గాయాలయ్యాయి. మృతునికి గత కొన్ని నెలల క్రితమే వివాహమైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కారు వేగంగా ఢీకొనడంతో కారు నుజ్జునుజ్జయ్యింది. వెంకటేశ్వర్‌రెడ్డి డ్రైవింగ్ సీట్లోనే ఇరుక్కునిపోయాడు. పోలీసులకు సమాచారం అందడంతో ఎస్ఐ ఉమాశంకర్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్థానికుల సహకారంతో అతికష్టం మీద బయటకు తీశారు. తీవ్ర గాయాలైన క్షతగాత్రులను ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ నుంచి ఉదయగిరి ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి దగ్గరుండి ప్రథమ చికిత్స చేయించి అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరు తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళా దొంగ అరెస్టు

● రూ.2లక్షల విలువైన బంగారు ఆభరణాలు, నగదు స్వాధీనం

కోదాడ, మే 22 : సూర్యాపేట జిల్లా కోదాడతోపాటు పలు బస్‌స్టేషన్లలో దొంగతనాలకు పాల్పడుతున్న మహిళను పట్టణ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని నెల్లూరు జిల్లా కావలి మండలం బుడంగుంట గ్రామానికి చెందిన కర్రెద్దుల లలిత దొంగతనాలకు చేసేది. ఈ క్రమంలో ఈ నెల 18వ తేదీన మునగాల మండలం తిమ్మారెడ్డిగూడెంకి చెందిన మహిళ, కోదాడ ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు ఎక్కేందుకు సిద్ధంగా ఉండగా, ఆమె మెడలో ఉన్న చంద్రహారం, చెవి దిద్దులు, ముక్కుపొడుక, ఉంగరం, రూ.30 వేల నగదు అపహరించింది. బుధవారం కోదాడ పట్టణంలోని ఓ బంగారు ఆభరణాల దుకాణంలో దొంగిలించిన బంగారం అమ్మేందుకు తిరుగుతుండగా అనుమానం వచ్చిన పోలీసులు ఆమె విచారించారు. బంగారం, నగదు, దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. రెండు రాష్ట్రాల్లో మహిళపై 50కి పైగా కేసులు ఉన్నాయని తెలిపారు. పలుమార్లు జైలు శిక్ష, అనుభవించినట్లు తెలిపారు. ఆమె వద్ద నుంచి రూ.రెండు లక్షల విలువైన బంగారు ఆభరణాలు, నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

నిరుపయోగంగా బస్‌స్టేషన్


నిరుపయోగంగా ఉన్న బస్ స్టేషన్

వలేటివారిపాలెం, మే 22: మండల కేంద్రమైన వలేటివారిపాలెంలో లక్షలు వెచ్చించి నిర్మించిన బస్‌స్టేషన్ ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిరుపయోగంగా మారింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలో గ్రామీణ ప్రాంతాల ప్రయాణికులను దృష్టిలో పెట్టుకొని రూ. 10 లక్షలతో వలేటివారిపాలెంలో ప్రయాణికులకు అవసరమైన మరుగుదొడ్లు, తాగునీరు, కూర్చోవడానికి వసతి తదిర సదుపాయాలతో బస్‌స్టేషన్ నిర్మించారు. రెండేళ్లపాటు బస్సులు బస్‌స్టేషన్‌లోకి వెళ్లేవి. తదనంతరం ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం వలన బస్సులు బస్‌స్టేషన్‌లోకి వెళ్లకపోవడంతో ప్రయాణికులు కూడా బస్‌స్టేషన్‌లోకి వెళ్లడం మానేశారు. దీంతో బస్‌స్టేషన్ నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరింది. ఆర్టీసీ అధికారులు పట్టించుకోకపోవడంతో సంచార జాతులకు నిలయంగా మారింది. బస్‌స్టేషన్‌లో మరుగుదొడ్లు వినియోగం లేక శిథిలావస్థకు చేరాయి. విద్యుత్ మోటారు అపహరణకు గురైంది. అయినప్పటికీ పట్టించుకునే నాథుడే కరువయ్యారు. దీంతో ప్రయాణికులు పాత బస్టాండు మూడు రోడ్ల కూడలిలో వసతులు లేక ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి బస్ స్టేషన్‌ను వినియోగంలోకి తీసుకురావల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పొగాకు కొనుగోళ్లు వేగవంతం చేయాలి

● బోర్డు అధికారులకు రైతుల మొర


పొగాకు మండెలను పరిశీలిస్తున్న రైతు

కలిగిరి, మే 22: పొగాకు కొనుగోళ్ళు వేగవంతం చేయాలని రైతులు అధికారులను కోరుతున్నారు. పొగాకు వాణిజ్య పంట. ఈ ఏడాది సాగు చేసిన రైతులకు ఈపంట పచ్చ బంగారంగా మారిపోయింది. గతేడాది కేజీ పొగాకు గరిష్ఠ ధర రూ280 పలకగా ఈ ఏడాది బంగారం ధరలు పెరిగిపోతునట్లు, ఇప్పటికే కేజీ పొగాకు రూ. 230 నుండి రూ. 320 మార్కు దాటేసింది. కలిగిరి పొగాకు వేలం కేంద్రం పరిధిలో ఈ ఏడాది పంట సాగుకు 1200 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. బోర్డు అధికారులు 4.5మిలియన్ కేజీల అమ్మకాలకు అనుమతి ఇవ్వగా ధరలు పెరుగుతాయనే ఉద్దేశ్యంతో అధిక విస్తీర్ణంలో సాగుచేయడం ద్వారా 7.5 మిలియన్ కేజీల దిగుబడి రావచ్చని బోర్డు అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు 3.2మిలియన్ కేజీలు మాత్రమే పొగాకు అమ్మకాలు జరిగాయి. ఇందులో 1మిలియన్ కేజీలు మాత్రమే బ్రైట్, మీడియం రకం పొగాకు అమ్మకాలు జరుగగా, మరో 2.2 మిలియన్ కేజీలు లోగ్రేడ్ పొగాకు అమ్మకాలు జరిగాయి. ఈ కారణంతో రైతులవద్ద అధిక మొత్తంలో బ్రైట్, మీడియం 2 మిలియన్ కేజీలు ఉండగా, అదే మొత్తంలో లోగ్రేడ్ పొగాకు కూడా 2.5 మిలియన్ కేజీలు ఉన్నట్లు రైతులు పేర్కొంటున్నారు. దీంతో సుమారు 4.5 మిలియన్ కేజీల పొగాకు నిల్వలు రైతుల ఇళ్ళ వద్ద ఉన్నాయి. ప్రస్తుతం రోజురోజుకి పొగాకు ధర పెరిగిపోతూ ఉండటంతో ఇంకా ఎక్కువ మద్దతు ధర అందుతుందనే ఆశతో రైతులు ఇళ్ళ వద్ద మొదటి రకం పొగాకు ఎక్కువ శాతం నిల్వ ఉంచినట్లు అధికారులు తెలియజేస్తున్నారు. అనుమతి ఇచ్చిన వరకు కొనుగోళ్ళకు మరో మూడువారాల సమయం చాలని అధికారులు పేర్కొనగా, రోజులు జరిగేకొద్దీ పొగాకు నాణ్యతలో తేడా వచ్చి రంగు మారే పరిస్థితి ఉందని, తమవద్ద ఉన్న పొగాకు బేళ్ళను పరిశీలించి కొనుగోళ్ళు వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.

వెలగని వీధిలైట్లు

● అంధకారంలో ఆర్వోబీ వంతెన


అంధకారంలో ఉన్న ఆర్వోబీ వంతెన

కావలి, మే 22: కావలి పట్టణం ఉదయగిరి రోడ్డులోని ఆర్వోబీ వంతెనపై గత వారం రోజులుగా వీధిలైట్లు వెలగకపోవటంతో అంధకారం నెలకొంది. లైటింగ్ స్తంభాల కోసం ఫుట్‌పాత్ కింద అమర్చిన కేబుల్ వైర్లు దెబ్బతినటంతో వాటి స్థానంలో కొత్త కేబుల్ వైర్లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో వంతెనపై లైట్లు వెలగక అంధకారం నెలకొంది. నిత్యం రద్దీగా ఉండే వంతెన మార్గంలో తరచూ ప్రమాదాలు జరుగుతుంటాయి. అయితే రాత్రి సమయంలో అక్కడ అంధకారం నెలకొనటంతో ఎదురుగా వచ్చే వాహనాలు పెద్దగా కనపడకపోవటం వలన వంతెన మార్గంలో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. కేబుల్ వైర్లు ఏర్పాటు మరో ఐదారు రోజులు పట్టే పరిస్థితులు కనిపిస్తుండటంతో వంతెనపై రాకపోకలకు వాహన చోదకులతో పాటు పాదచారులు సైతం రాత్రి సమయంలో భయపడుతున్నారు. అధికారులు స్పందించి వంతెనపై కేబుల్ వైరు ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేసి లైట్లు వెలిగించి అంధకారం నుంచి విముక్తి కలిగించాలని కోరుతున్నారు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి

కంటైనర్‌ను ఢీకొన్న ట్యాంకర్

● మంటల్లో కాలిపోయిన డ్రైవర్

మేదరమెట్ల, మే 22 : జాతీయ రహదారి మేదరమెట్ల బైపా‌స్‌లో ఆగిఉన్న కంటెనర్ లారీని ట్యాంకర్ లారీ ఢీకొన్న సంఘటనలో ట్యాంకర్ లారీ దగ్ధం అయింది. ఈ ప్రమాదంలో ట్యాంకర్ లారీ డ్రైవర్ మంటల్లో సజీవదహనమయ్యాడు. మంగళవారం అర్ధరాత్రి నెల్లూరు జిల్లా కృష్ణపట్నం పోర్టు నుంచి పేరిచర్లలో ఉన్న జోసిల్ సోప్స్ కంపెనీకి సోప్ ఆయిల్ తీసుకువెళ్తున్న నెల్లూరు జిల్లా కోవూరు మండలం ఇనమడుగు గ్రామానికి చెందిన ట్యాంకర్ డ్రైవర్, ఓనర్ అయిన కే శ్రీధర్(40) ప్రమాదంలో సజీవ దహనమయ్యారు. నిద్రమత్తులో మార్జిన్‌లో ఆగి ఉన్న కంటైనర్‌ను వెనుక నుంచి ఢీకొట్టడంతో క్యాబిన్‌లో మంటలు వ్యాపించి డ్రైవర్ పూర్తిగా కాలిపోయాడు. మేదరమెట్ల ఇన్‌చార్జి, పంగులూరు ఎస్‌ఐ తిరుపతిరావు పరిశీలించి కేసు నమోదు చేశారు.



డ్రైవర్‌తోపాటు దగ్ధమైన ట్యాంకర్ లారీ

పర్యావరణ పరిరక్షణతోనే భావితరాలకు మనుగడ


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం, మే 22: ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టి పర్యావరణాన్ని కాపాడుకుంటేనే భావితరాలకు మనుగడ ఉంటుందని జిల్లా రిసోర్సు సభ్యులు గండికోట సుధీర్‌కుమార్ అన్నారు. శాఖ గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణలో భాగంగా బుధవారం గ్రంథాలయ అధికారి మంజులత ఆధ్వర్యంలో అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు జీవ వైవిధ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించి పిల్లలతో ప్రతిజ్ఞ చేయించారు. మడ అడవులు, నేలలు, సముద్రాలు, సరస్సులు కాపాడుకుంటేనే జీవ వైవిధ్యాన్ని రక్షించుకోగలమన్నారు. అనంతరం విద్యార్థులకు జీవ వైవిధ్యంపై పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

పొలాల్లో పచ్చిరొట్ట ఎరువులు వేసుకోవాలి


శిక్షణలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి సురేంద్రరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, మే 22: వ్యవసాయ భూముల్లో భూసారం పెంపుదల కోసం రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి పచ్చిరొట్ట ఎరువులు వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సురేంద్రరెడ్డి తెలిపారు. బుధవారం రేబాల రైతుభరోసా కేంద్రంలో భూసార పరిరక్షణపై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. రైతుభరోసా కేంద్రాల్లో రాయితీపైన పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగలు కేజీ.రూ.44, జనుము, రూ.44. పిల్లిపెసర రూ.67కు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఎడగారులో పొలాల్లో వేసుకుని కలియదున్నాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు అనిత, బి.పవన్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

జూన్ 12లోగా పిల్లలందరికీ పుస్తకాలు

● సీఎంవో పెంచలయ్య


మనుబోలులో పాఠ్యపుస్తకాల గదిని పరిశీలిస్తున్న సీఎంవో పెంచలయ్య

మనుబోలు, మే 22: విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జూన్ 12 లోగా ప్రతివిద్యార్థికి పుస్తకాలు అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సీఎంవో పెంచలయ్య తెలిపారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయం నుంచి బుధవారం మొదటవిడ తగా మండలానికి 13,260 నోటు పుస్తకాలు చేరాయి. వాటిని స్థానిక ఉన్నత పాఠశాలలో సీఆర్‌పీలు, ఐఈఆర్‌టీ సిబ్బంది భద్రపరిచారు. భద్రపరిచిన గదిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. విద్యాకానుక కిట్టులో భాగంగా నోటుపుస్తకాలు మాత్రమే వచ్చాయన్నారు. ఇంకా పాఠ్య పుస్తకాలు, బ్యాగులు రావాల్సి ఉందన్నారు. ప్రతిపిల్లవాడికి బడితెరిచే నాటికి కిట్టు అందచేయాలని సిబ్బందికి సూచించామన్నారు. నోటు పుస్తకాలను 8,9,10 తరగతుల వారికి మాత్రమే ఇస్తారమన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 రమేష్ కుమార్, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ ఆదిశేషయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నృసింహుడి గ్రామోత్సవం



మనుబోలు, మే 22: లక్ష్మీనరసింహాపురంలో మంగళవారం అర్ధరాత్రి నృసింహస్వామి గ్రామోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం చేసి ప్రత్యేక అలంకరణలతో అర్చకులు వెంకటనాగాచార్యులు వేదమంత్రాలతో శాస్త్రోపేతంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలకు ఉప్పలపాటి జగదీ‌ష్ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. అనంతరం సాయంత్రం స్వామివారిని గరుడవాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామివారికి నైవేద్యాలు నివేదించి మొక్కులు తీర్చుకున్నారు.

పెంచలకోన భక్తులకు మజ్జిగ చలివేంద్రం



మజ్జిగ పంపిణీ చేస్తున్న భక్తులు

పొదలకూరు, మే 22 : పెనుశిల లక్ష్మీనరసింహస్వామి జయంతిని పురస్కరించుకుని పెంచలకోనకు వచ్చే భక్తుల కోసం పట్టణంలోని పంచాయతీ బస్టాండ్ ఆవరణంలో శ్రీవెంకటేశ్వర బోర్‌వెల్స్, కోమల క్యాటరింగ్ నిర్వాహకులు బుధవారం మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దాన్ని పొదలకూరు ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి ప్రారంభించారు. అనంతరం భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. పెంచలకోన బ్రహ్మోత్సవాలకి పొదలకూరు మీదుగా వేలాది భక్తుల దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం హర్షణీయం అన్నారు. కార్యక్రమంలో చొప్పా వెంకటేశ్వర్లు, కొశెట్టి వెంకటేశ్వర్లు, పెదమల్లు రణారెడ్డి, కొమ్మి వేణుగోపాల్, దాశినేని ప్రసాద్, మనోజ్, తోట పెంచలయ్య, కోటపాటి కృష్ణమ నాయుడు, ప్రేమ్‌చంద్, శ్రీధర్ పాల్గొన్నారు.

ఇందుకూరుపేట: స్థానిక లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత స్వామివారికి కల్యాణం నిర్వహించారు. అనంతరం ఆలయ పరిసరాల్లో పల్లకీ సేవ చేపట్టారు. అంతకుముందు పంచామృతాలతో తిరుమంజనం, సహస్ర నామ పూజలు, విశేష పూజలు చేశారు. ఉభయకర్తలుగా ఆత్మకూరు గోవర్ధన్, ఆత్మకూరు శ్రీనివాసులు వ్యవహరించారు. కార్యక్రమంలో అర్చకులు యువీ శేషాచార్యులు, నందకిషోర్, నరేష్, ఏ.నారాయణాచార్యులు పాల్గొన్నారు.

కామాక్షితాయికి బంగారు హారం

బుచ్చిరెడ్డిపాళెం, మే 22: జొన్నవాడ కామాక్షితాయి అమ్మవారికి బుధవారం కడప పట్టణానికి చెందిన హెచ్.శ్రీలక్ష్మి సుమారు 63.160 గ్రాముల బంగారు హారాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి వి.గిరికృష్ణకు అందజేశారు. అంతకుముందు దాతలు గోత్ర నామాలతో ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.


కామాక్షితాయికి దాతలు బహూకరించిన బంగారు హారం

నృసింహుడి సన్నిధిలో డీఆర్‌డీవో మాజీ చైర్మన్ సతీష్‌రెడ్డి

రాపూరు(డక్కిలి), మే 22: పెంచలకోన నృసింహస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా బుధవారం శ్రీవారి కల్యాణం వేడుకను కన్నులపండువగా నిర్వహించారు. ఈ వేడులను ప్రముఖ శాస్త్రవేత్త, డీఆర్‌డీవో మాజీ చైర్మన్ డాక్టర్ సతీష్‌రెడ్డి తిలకించారు. అంతకుముందు స్వామి, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఉచిత వైద్యశిరాలు..చలివేంద్రాల ఏర్పాటు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా రాపూరుకు చెందిన ఆర్‌ఎంపీలు కందుకూరు మస్తాన్‌బాబు, చంద్రశేఖరు ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి భక్తులకు వైద్యసేవలు అందిస్తున్నారు. పెంచలకోన రోడ్డు మార్గంలో అక్కడక్కడ దాతలు మంచి నీటి చలివేంద్రాలు ఏర్పాటు చేసి భక్తుల దాహార్తిని తీరుస్తున్నారు. వరికొందరు అన్నదానం కార్యక్రమాలు చేపట్టారు.


స్వామి దర్శనానంతరం ఆలయంలో ప్రముఖ శాస్త్రవేత్త, డీఆర్‌డీవో మాజీ చైర్మన్ డాక్టర్ సతీష్‌రెడ్డి తదితరులు

రేపు విశ్రాంత ఉద్యోగుల సమావేశం

నెల్లూరు(హరనాథపురం) : ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సమావేశం శుక్రవారం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంటు రిటైర్డు ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యదర్శి వెంకయ్య ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5గంటలకు టౌన్‌హాల్లో జరిగే సమావేశానికి హాజరు కావాలని కోరారు.

సా..గుతున్న 'పునరాభివృద్ధి'

● నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌లో పనులు
● 21 నెలల గడువు ఈ నెలతో పూర్తి
● అయినా నత్తనడకన సాగుతున్నవైనం
● రైల్వే ప్రయాణికులకు అసౌకర్యం


నాలుగు ప్లాట్‌ఫామ్‌లను కలుపుతూ నిర్మిస్తున్న వంతెన

నెల్లూరు (వెంకటేశ్వరపురం), మే 22 : నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. 21నెలల్లో పనులు పూర్తి చేస్తామని చెప్పిన కాంట్రాక్టర్, ఆ గడువు ప్రస్తుత మేనెలతో ముగిసినా ఇంతవరకు 60 శాతం పనులు కూడా పూర్తి చేయలేదు. దీంతో నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు రూ.102 కోట్ల అంచనా వ్యయంతో 2019వ సంవత్సరంలో అప్పటి ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడు, రైల్వేశాఖ మంత్రి పియూష్ గోయల్ ఈ పనులకు శంకుస్థాపన చేశారు. కానీ, అభివృద్ధి పనులు 2022 సెప్టెంబరులోగానీ మొదలు కాలేదు. హైదారాబాద్‌కు చెందిన ఎస్‌సీఎల్ ఇన్‌ఫ్రాటెక్ లిమిటెడ్‌కు ఈపీసీ విధానంలో ఈ పనుల కాంట్రాక్ట్ అప్పగించారు. 21 నెలల గడువులోగా అంటే 2024 మే మాసం నాటికి పనులను పూర్తిచేస్తామని కాంట్రాక్టర్ ఒప్పందం చేసుకున్నారు. ఇంతవరకు సుమారు 60శాతం మేర పనులే పూర్తి చేశారు. నూతన కమర్షియల్ బిల్డింగ్, అన్ని ప్లాట్‌ఫామ్‌లు కలుపుతూ వంతెన నిర్మాణం పూర్తి కావస్తున్నాయి. 6లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన అండర్ స్టోరేజ్ ట్యాంక్, నూతన షెడ్లు, ఇరువైపుల నూతన భవనాలు, తూర్పువైపు అండర్‌పాస్ నిర్మాణంతో అనేక వసతుల ఈ స్టేషన్‌లో ఏర్పాటు చేస్తున్నారు. పనులు నత్తనడకన సాగుతుండటంతో ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. అన్ని ప్లాట్‌ఫామ్‌లపై పనులు జరుగుతుండటంతో నడిచేందుకు, రైళ్లు వచ్చినపుడు వాటిని ఎక్కేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వేసవి సెలవులు కావడం ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటోంది. కాంట్రాక్టర్ ప్రత్యేక చొరవతో పనులు చేయాల్సి ఉంది.


తూర్పువైపున నిర్మాణంలో ఉన్న భవనం


ప్లాట్‌ఫామ్‌పై ఏర్పాటు చేసిన బారికేడ్ వద్ద రైలు కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

రూ. 20 లక్షలు మోసపోయా..!

నెల్లూరు (సాంస్కృతికం) మే 22: నగరంలోని ఆదిత్యనగర్ కెనరా బ్యాంకు మేనేజరు, సిబ్బంది బ్రోకర్ల ద్వారా వ్యక్తిని చూడకుండానే రుణాలు మంజూరు చేస్తూ రుణగ్రస్తులను మోసం చేస్తున్నారని రాపూరు గరిమనపెంట ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు కానం వెంకట శివకుమార్ తెలిపారు. బుధవారం జర్నలిస్టు భవనంలో ఆయన మాట్లాడారు. తనకు రుణం అవసరం వచ్చి ఫైనాన్స్ కంపెనీలను విచారిస్తుండగా, గొల్లపల్లె చిన్నయ్య అనే వ్యక్తి లోను ఇప్పిస్తానని చెప్పారని తెలిపారు. తన వద్ద నుంచి రెండు ప్రామిసరీ నోట్లు, 4 చెక్కులు తీసుకుని కెనరా బ్యాంకు (ఆదిత్యనగర్)లో రూ.20లక్షల రుణం మంజూరు చేయించాడని తెలిపారు. అందులో రూ.15లక్షలను చిన్నయ్య కలువాయి వైద్యశాలలో పనిచేస్తున్న సత్తెనపల్లి ఓబులురాజు అనే వ్యక్తి పేరున నేరుగా బ్యాంకు నుంచి బదిలీ చేయించుకున్నారని తెలిపారు. బ్యాంకులో మిగతా లోనుడిపాజిట్ చేశారని రుణం ఈఎంఐలు తన జీతం ద్వారా చెల్లించే ఏర్పాటు చేశారని పేర్కొన్నాడు. రూ.20లక్షల రుణంలో తనకు ఒక్కపైసా దక్కలేదని, జీతం రుణం వాయిదాలకు వెళ్లడంతో తమ కుటుంబం పస్తులు ఉంటున్నదని తెలిపారు. తనకు జరిగిన మోసంపై ఐదవనగర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని తెలిపారు. జిల్లా అధికారులు జోక్యం చేసుకుని న్యాయం చేయాలని కోరారు.

ఓట్లు లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి

● 3న పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్ బాక్సుల తరలింపు
● సిటీ ఆర్వో వికాస్


రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షిస్తున్న ఆర్వో వికాస్

నెల్లూరు(సిటీ), మే 22 : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని నెల్లూరు సిటీ ఆర్వో వికాస్ మర్మత్ తెలిపారు. బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమీక్షించారు. ఎన్నికల సంఘం నియమ, నిబంధనల మేరకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో ఉన్న పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్ బాక్సులను జూన్ 3వతేదీన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కౌంటింగ్ కేంద్రమైన ప్రియదర్శిని ఇంజనీరింగ్ కాలేజీకి తరలిస్తామని చెప్పారు. 4వ తారీఖున ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ఉంటుందని, 8.30 గంటలకు ఈవీఎంలలోని ఓట్ల లెక్కింపు మొదలవుతుందని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు కౌంటింగ్‌పై వారి ఏజెంట్లకు ముందుగా అవగాహన కల్పించాలని కోరారు. అధికారులు జారీ చేసిన గుర్తింపు కార్డులను తీసుకుని కౌంటింగ్ కేంద్రానికి రావాలన్నారు. కనుపర్తిపాడు జడ్పీ హైస్కూల్లో పార్కింగ్ వసతి కల్పించినట్లు వెల్లడించారు.

వైభవంగా నందిసేవ ఉత్సవం

నెల్లూరు (సాంస్కృతికం) మే 22 : నగరంలోని ఉస్మాన్‌సాహెబ్‌పేట అన్నపూర్ణ సమేత కాశీవిశ్వనాథ ఆలయం బ్రహ్మోత్సవాల్లో బుధవారం రాత్రి నందిసేవ ఉత్సవం వైభవంగా జరిగింది. ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అర్చనలు, పుష్పాలంకారం, విశేష పూజలు జరిగాయి. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్సవాలను ధర్మకర్తలు, ఉభయకర్తలు, ఈవో దర్గయ్యలు పర్యవేక్షించారు.


కాశీవిశ్వనాథునికి నందిసేవ అలంకారం




నరసింహకొండపై స్వామివారిని అలంకార మండపం నుంచి కల్యాణ మండపానికి తీసుకువస్తున్న అర్చకులు, కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు


పెంచలకోనలో జరిగిన బంగారు గరుడోత్సవంలో పాల్గొన్న భక్తులు


కోనలో బుధవారం రాత్రి ఆలయం ఎదుట సేద తీరిన భక్తులు

సృష్టిలయలు కొనసాగించడం పరబ్రహ్మం లక్షణం

నెల్లూరు (సాంస్కృతికం) మే 22 : సృష్టిలయలను కొనసాగించడం పరబ్రహ్మం ముఖ్య లక్షణమని ఓరుగంటి శ్రీరాములశర్మ తెలిపారు. పొగతోట ఆదిశంకర ధ్యాన నిలయంలో ఆదిశంకరాచార్య సంస్కరణ వారోత్సవాల్లో బుధవారం ఆయన ప్రవచనం చేశారు. సృష్టి ఆదిలో ఉన్న బ్రహ్మలయమైన తర్వాత ఉన్న బ్రహ్మం ఒక్కటే, అదే ఆత్మ దాని లక్షణం నిరుక్తంలో తెలిపినట్లు సిద్ధాంత పూర్వకంగా ఆదిశంకరాచార్యులు రుజువు చేశారని తెలిపారు. ఈ సందర్భంగా మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, అర్చనలు, ఆదిశంకరాచార్యులు, లక్ష్మీనరసింహస్వామిలకు పుష్పార్చనలు జరిగాయి. కార్యక్రమంలో చక్రాల ట్రస్ట్ సభ్యులు, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా పాస్టర్ల కమిటీ ఎన్నిక

నెల్లూరు (సాంస్కృతికం) మే 22: జిల్లా మహిళా పాస్టర్ల కార్యవర్గాన్ని ప్రజాసత్తా పాస్టర్ పవర్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు పులగర శోభన్‌బాబు ప్రకటించారు. బుధవారం జర్నలిస్టు భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. మహిళా పాస్టర్ల జిల్లా కమిటీ అధ్యక్షురాలుగా సర్వేపల్లి వరలక్ష్మి, ఉపాధ్యక్షురాలిగా తిరుపతి బుజ్జమ్మ, నాగలాపురం మేరీ, కార్యదర్శిగా దుడ్డు సుస్మిత, సహాయ కార్యదర్శిగా పల్లి గ్లోరీ, కోశాధికారిగా వాదనాల జయమ్మ, కన్వీనర్‌గా తలారి పోలమ్మ, గౌరవాధ్యక్షురాలిగా గుంజి శాంతమ్మలను ఎంపిక చేశామన్నారు. అనంతరం వారి చేత ప్రమాణం చేయించామన్నారు.

పర్యావరణాన్ని రక్షించాలి


మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మే 22: మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ పిలుపునిచ్చారు. నరసింహ జయంతి సందర్భంగా బుధవారం నగరంలోని పాత మున్సిపల్ కార్యాలయంలో ఆయన మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ విధిగా ఇంట్లో ఆరు మొక్కలు చొప్పున నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కీపూడి బాబు, అలిమేలు శ్రీను, హర్షవర్ధన్, కారిక్ తదితరులు పాల్గొన్నారు. కాగా, జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను యశ్వంత్‌సింగ్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో గవర్నర్‌ను సత్కరించారు.

ఇతిహాసాలపై క్విజ్

నెల్లూరు (సాంస్కృతికం), మే 22 : నగరంలోని స్టోన్‌హౌస్‌పేటలో గల జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో బుధవారం విద్యార్థులకు రామాయణం, మహాభారతం వంటి ఇతిహాసాలపై క్విజ్ నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ఆర్ఎస్ఆర్ నగర పాలక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు సతీ‌ష్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ క్విజ్ నిర్వహించారు. మన పురాణాలు, ఇతిహాసాలు మరిచిపోతున్న ఈతరం వారికి ఇలా అవగాహన కలిగించడం అభినందనీయమని జిల్లా కేంద్ర గ్రంథాలయం డిప్యూటీ లైబ్రేరియన్ ప్రసాద్ అన్నారు. ఈ క్విజ్‌లో ప్రతిభ కనపరిచిన ముగ్గురు విద్యార్థులకు వేసవి శిబిరం ముగింపు రోజున బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది కృష్ణయ్య, జితేంద్ర పాల్గొన్నారు.

ఫ్రెండ్స్ వాకర్స్ మజ్జిగ చలివేంద్రం


నెల్లూరు (విద్య), మే 22 : ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో బుధవారం మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. అసోసియేషన్ అధ్యక్షుడు బిరదవోలు రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులు, వాకర్స్‌కు వేసవిలో ఉపశమనం కలిగించేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఏడాది ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం క్రీడాకారులకు, వాకర్స్‌కు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ 203 గవర్నర్ పీ శ్రీనివాసులు రెడ్డి, అసోసియేషన్ కార్యదర్శి షేక్ నజీర్ అహ్మద్, కోశాధికారి సుబ్బరాయుడు, వాకర్స్ ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ నలుబోలు బలరామయ్య నాయుడు, నేతలు రాఘవరెడ్డి, రమణయ్య, కొండూరు సుబ్బారావు, మారుతీరావు, హరిబాబు, ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మజ్జిగ పంపిణీ చేస్తున్న వాకర్స్ నాయకులు

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తిరుపతి

జిల్లా వార్తలు

గురువారం 23 మే 2024

ఇష్టవాహనంపై ఇలవేల్పు వైభోగం

పెంచలకోనలో గరుడోత్సవానికి పోటెత్తిన భక్తులు



బంగారు గరుడవాహనంపై శ్రీవారు

డక్కిలి, మే 22: కొండాకోనా ఎటు చూసినా కనుచూపు మేరా భక్తజనమే.. ఎవరినోట విన్నా పెంచలో.. పెంచలా.. గోవిందా.. గోవిందా... నమో.. లక్ష్మీ నారసింహ.. అనే నామ స్మరణే. పెంచలకోన బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వర్ణమయ కాంతులతో మెరిసిపోతున్న గరుడ్మంతుడిపై నరసింహస్వామి కొలువుదీరి భక్తులను కటాక్షించాడు. తమ ఇలవేల్పు దివ్యస్వరూపాన్ని తిలకించిన భక్తులు ఆనంద డోలికల్లో మునిగితేలారు. నృసింహస్వామి జయంతి సందర్భంగా బుధవారం రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలి రావడంతో పెంచలకోన కిక్కిరిసింది. ఉదయం స్వామివారు సింహవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకుల విశేష పూజల అనంతరం క్షేత్రోత్సవం నిర్వహించారు. అంతకుముందు ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం, విశేష పూజలు, హోమాలు కొనసాగించారు. రాత్రికి స్వామివారిని తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చి సహస్ర దీపాలంకరణ మండపానికి తరలించారు. శ్రీదేవి, భూదేవితో కలిపి ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం స్వర్ణ గరుడుడిపై స్వామివారు కోనలో మూడ వీధుల్లో విహరించారు. ఈ కార్యక్రమాల్లో ఏసీ డబ్బుగుంట వెంకటేశ్వర్లు, డీసీ కే విజయసాగర్ సాగరబాబు, ఆలయ ఇన్‌స్పెక్టర్ హరీష్, ప్రధాన అర్చకులు రామయ్యస్వామి, శశికుమార్‌స్వామి, గుండ్లూరు సీతారామయ్య, పెంచలయ్య, బాలాజీ, మధుస్వామితో పాటు టీటీడీ అర్చకులు పాల్గొన్నారు.



సింహ వాహనంపై స్వామివారు

నేడు కల్యాణం :

కోనలో గురువారం ఉదయం శ్రీవారి కల్యాణం వేడుకగా నిర్వహించనున్నారు. ఇందుకుగాను మండపాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. సాయంత్రం ఆరు గంటలకు రథోత్సవం, అనంతరం గజవాహన సేవ నిర్వహిస్తారు.

గంగమ్మ విశ్వరూపం



- పులకించిన భక్తజనం
- ముగిసిన జాతర

తిరుపతి, మే 22 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని తాతయ్యగుంట గంగమ్మ విశ్వరూప దర్శనం.. చెంప నరుకుడంతో వారం రోజుల గంగ జాతర వేడుక ముగిసింది. బుధవారం ఉదయం ఆరు గంటల ప్రాంతంలో పేరంటాల వేషం ధరించిన కైకాల వంశస్థుడు సాంబ గంగమ్మకు ఆలయానికి చేరుకున్నాడు. అప్పటికే ఆచారులు విశ్వరూప స్తంభానికి ఎండుగడ్డి, బంకమన్నుతో అమ్మవారి విశ్వరూపాన్ని తయారుచేసి ఉంచడంతో భక్తుల అమ్మవారి నామస్మరణల మధ్య పేరంటాల వేషధారి చెంప నరికారు. ఆ ప్రతిమ మన్ను కోసం భక్తులు ఎగబడ్డారు. మన్ను దొరికినవారు ఎంతో పవిత్రంగా ఇంటికి తీసుకెళ్లారు. కాగా, మంగళవారం అర్ధరాత్రి నుంచి కూడా మగవారు ఆడ వేషాలు ధరించి.. డప్పుల వాయిద్యాలతో ఒక్కో వీధి నుంచి బృందాలుగా ఏర్పడి.. చిందులేస్తూ అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. మహిళలు సైతం పూనకంతో ఊగిపోతూ కనిపించారు. ఆలయానికి చేరుకుని వజ్రకిరీటధారి అయిన గంగమ్మను దర్శించుకున్నారు. అనంతరం విశ్వరూప దర్శనం కోసం అక్కడే ఉండిపోయి, దర్శనం చేసుకుని తిరుగుముఖంపట్టారు. దీంతో జాతర మహోత్సవం పరిసమాప్తి అయ్యింది.



పేరంటాల వేషంలో కైకాల వంశస్థుడు సాంబ

జిల్లా అంతటా రెడ్ అలర్ట్

కౌంటింగ్‌కి వారం ముందు నుంచే కఠిన ఆంక్షలు

- 144 సెక్షన్, 30 పోలీసు యాక్టు అమలు
- సమస్యాత్మక ప్రాంతాల్లో కేంద్ర బలగాలు



కూచువారిపల్లెలో నిర్వహిస్తున్న ఫ్లాగ్ మార్చ్

తిరుపతి(నేరవిభాగం), మే 22: పోలింగ్ తర్వాత కొన్ని చోట్ల చెలరేగిన హింస నేపథ్యంలో కౌంటింగ్‌కి వారం ముందు నుంచే జిల్లా అంతా రెడ్ అలర్ట్ ప్రకటించాలని నిర్ణయించారు. ముఖ్యంగా కౌంటింగ్ రోజున హింసకు తావులేకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పాత పగలను దృష్టిలో పెట్టుకుని గెలిచినవారు ఆనందోత్సాహాలతోనూ, ఓడినవారు నిస్పృహతోనూ దాడులకు తెగబడే అవకాశాలు ఉన్నాయని నిఘా వర్గాలు హెచ్చరించడంతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లకు పూనుకుంటున్నారు. ఇప్పటికే జిల్లాలో 696 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉండగా, అందులో చంద్రగిరి నియోజకవర్గంలోనే 397 ఉన్నాయి. వీటిలో 202 సమస్యాత్మక కేంద్రాలుగా ఎన్నికల సంఘం గుర్తించి 100 శాతం వెబ్ క్యాస్టింగ్ ఏర్పాటు చేసింది. అయినా ఎన్నికల తర్వాత హింసను పోలీసు యంత్రాంగం నిరోధించలేక పోయింది. కూచువారిపల్లె, రామిరెడ్డిపల్లె, పులివర్తివారిపల్లె, బ్రాహ్మణకాలువ, తిరుపతిలోని పద్మావతి మహిళా వర్సిటీల వద్ద చోటు చేసుకున్న ఘటనల్లో పోలీసులు నిర్లక్ష్యం వహించారనే ఆరోపణల నేపథ్యంలో దాదాపు ఇద్దరు డీఎస్పీలు, ఇద్దరు సీఐలను ఎన్నికల సంఘం సస్పెండ్ చేసిన విషయం విదితమే. ఈప్రదేశాలతోపాటూ చంద్రగిరి నియోజకవర్గంలోని నడవలూరు, దిగువ రామాపురం, అనుప్పల్లె, పాకాల మండలం పులివర్తివారిపల్లె, వెంకటగిరి నియోజకవర్గం డక్కిలి, గూడూరు నియోజకవర్గం చిల్లకూరు ప్రాంతాల్లోనూ ముందస్తుగా గట్టి చర్యలు తీసుకుంటున్నారు. ఏర్పాట్లపై ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అధికారులతో సమావేశమయ్యారు. చంద్రగిరి మండలం కూచువారిపల్లె, రామిరెడ్డిపల్లె గ్రామాలను ఆయన స్వయంగా పరిశీలించి అక్కడ నెలకొన్న పరిస్థితులపై ఆరా తీశారు. బుధవారం ఆ రెండు గ్రామాల్లో కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. అన్ని ప్రాంతాల్లో 144 సెక్షన్, 30 పోలీసు యాక్టు అమలు చేసే దిశగా చర్యలు తీసుకున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం, ఇంటెలిజెన్సు వర్గాల హెచ్చరికలతో అనుమానం ఉన్న గ్రామాలను జల్లెడ పడుతున్నారు. వీటితోపాటు సమస్యాత్మక గ్రామాలు, పట్టణాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించి, అనుమానం ఉన్నవారు, కొత్త వ్యక్తులు, స్థానికంగా నివాసం లేకుండా తలదాచుకోవడానికి వచ్చిన వారిపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. స్థానిక ఎన్నికల సమయంలో గొడవలు జరిగిన ప్రాంతాలను కూడా పరిగణనలోకి తీసుకుని భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. కౌంటింగ్ పూర్తయిన 15 రోజుల తర్వాత సైతం సెంట్రల్ బలగాలు అన్ని ప్రాంతాల్లో గట్టి బందోబస్తు నిర్వహించనున్నాయి.

బాటిళ్లలో పెట్రోలు, టపాసుల విక్రయాలపై నిషేధం

జిల్లా అంతటా బాణాసంచా విక్రయ కేంద్రాలు, బాటిళ్లలో పెట్రోలు అమ్మకాలను పూర్తిగా నిషేధించారు. కౌంటింగ్‌కు వారం ముందు నుంచి అన్ని బాణాసంచా దుకాణాలు మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఆర్డీవోలు, తహసీల్దార్లు, డీఎస్‌వోలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌లు, సిబ్బంది ముమ్మరంగా తనిఖీలు చేపట్టి.. కేసులు నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. నిబంధనలు అమలు చేయని పెట్రోలు బంకులు మూసివేయాలని సైతం ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం.

సీఆర్‌పీఎఫ్ నీడలో చంద్రగిరి, తిరుపతి

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చంద్రగిరి, తిరుపతి నియోజకవర్గాలను సీఆర్‌పీఎఫ్ బలగాల నీడలో ఉంచనున్నారు. శివారు ప్రాంతాల్లోనూ దూరంగా ఉన్న ఇళ్లలోనూ పోలీసులు తనిఖీ చేస్తున్నారు. ఎటువంటి మారణాయుధాలున్నా స్వచ్ఛందంగా ఇవ్వాలని అడుగుతున్నారు. తమ తనిఖీల్లో బయట పడితే మాత్రం హిస్టరీ షీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరిస్తున్నారు. ఏ మాత్రం అనుమానం వచ్చినా అదుపులోకి తీసుకుంటున్నారు. ఇదే సమయంలో పోలింగ్ అనంతరం హింసకు పాల్పడినవారిని వెతికి పట్టుకునేందుకు ప్రత్యేకంగా 10 టీములు ఏర్పాటు చేశారు. వీరు ఎక్కువగా ఆ రెండు నియోజకవర్గాలపైనే దృష్టి కేంద్రీకరించారు.

వారేం చేస్తున్నారంటే..?

- 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని ప్రధాన పార్టీ అభ్యర్థుల కార్యకలాపాలిలా

తిరుపతి, మే 22 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈనెల 13న పోలింగ్ ముగిసిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి పోలింగ్ సరళిపై రెండు, మూడ్రోజులపాటు వరుస సమీక్షలతో ప్రధాన పార్టీల అభ్యర్థులు తలమునకలయ్యారు. బూత్ స్థాయి ఏజంట్లు మొదలుకుని గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయి నేతలు, నమ్మకస్తులైన అనుచరులతో మాట్లాడి తమ విజయావకాశాలపై ఓ అంచనాకు వచ్చారు. ఎక్కడ ఏమి జరిగిందో, బలహీనపడింది ఎక్కడో, బలంగా ఉన్నది ఎక్కడో తెలుసుకున్నారు. పార్టీలో తమ గెలుపునకు పని చేసింది ఎవరో, పనిచేయకుండా చేసినట్టు నటించిందెవరో గుర్తించేందుకు యత్నించారు. ఈ కసరత్తు అంతా ముగించాక ఒత్తిడి తగ్గించుకునేందుకు కొందరు కుటుంబాలతో విహార యాత్రలు, తీర్థయాత్రలకు వెళ్లి వచ్చారు. మరికొందరు రెండు, మూడు నెలలుగా నిర్లక్ష్యం చేసిన వ్యాపారాలపై దృష్టి సారించారు. కొందరు స్థానికంగానే ఉంటూ కార్యకర్తలు, నాయకులను కలుసుకుంటున్నారు. పోలింగ్ దాకా సుడిగాలి పర్యటనలు, ప్రచారాలతో ఉక్కిరిబిక్కిరైన అభ్యర్థులు పోలింగ్ ముగిశాక ఏం చేస్తున్నారో నన్న ఆసక్తి జనంలో నెలకొంటోంది. ఈ నేపథ్యంలో బుధవారం జిల్లావ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల్లోనూ ప్రధాన పార్టీల అభ్యర్థుల కార్యకలాపాలను ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్ పరిశీలించింది.

- వెంకటగిరి టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ పోలింగ్ తర్వాత వెంకటగిరిలోనే అందుబాటులో ఉండి కార్యకర్తలు, నాయకులను కలుస్తూ వచ్చారు. ప్రస్తుతం ఆయన కుటుంబంతోసహా పుణ్యక్షేత్రాల సందర్శనకు వెళ్లారు. బుధవారం కర్ణాటకలోని ధర్మస్థలలో ఉన్నారు.
- వెంకటగిరి వైసీపీ అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్ పోలింగ్ ముగియగానే హైదరాబాదు వెళ్లిపోయారు. గత సోమవారం వెంకటగిరి వచ్చారు. మంగళవారం తిరుపతి గంగజాతరకు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. అక్కడినుంచి అటే హైదరాబాదు తిరిగి వెళ్లారు.

- గూడూరు టీడీపీ అభ్యర్థి పాశిం సునీల్ కుమార్ పోలింగ్ తర్వాత స్థానికంగానే అందుబాటులో ఉన్నారు. మంగళవారం వ్యక్తిగత పనులపై హైదరాబాదు వెళ్లారు.
- గూడూరు వైసీపీ అభ్యర్థి మేరిగ మురళీధర్ స్థానికంగా ఉంటూ కేడర్‌ను కలుసుకుంటున్నారు. బుధవారం ఆయన కుటుంబంతో కలసి తిరుమల వెళ్లారు.

- శ్రీకాళహస్తి టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి పోలింగ్ తర్వాత స్థానికంగానే ఉండి కేడర్‌ను కలిశారు. నాలుగు రోజులుగా హైదరాబాదులో ఉన్నారు.
- శ్రీకాళహస్తి వైసీపీ అభ్యర్థి బియ్యపు మధుసూదన్‌రెడ్డి కూడా పోలింగ్ తర్వాత కొద్ది రోజులు ఇక్కడే కేడర్‌కు అందుబాటులో ఉన్నారు. గత సోమవారం విజయవాడ వెళ్లారు.

- సూళ్లూరుపేట టీడీపీ అభ్యర్థి నెలవల విజయశ్రీ పోలింగ్ తర్వాత తిరుపతిలో ఉంటున్నారు. ఆమె తండ్రి, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం మాత్రం నాయుడుపేటలోని స్వగృహంలో ఉంటున్నారు. అభ్యర్థి తరఫున ఆయనే కేడర్‌తో సమీక్షించి వివరాలు తెలుసుకుంటున్నారు.
- సూళ్లూరుపేట వైసీపీ అభ్యర్థి కిలివేటి సంజీవయ్య పోలింగ్ తర్వాత కొద్ది రోజులు కేడర్‌కు అందుబాటులో ఉన్నారు. ఇటీవల డెహ్రాడూన్ వెళ్లి వచ్చిన ఆయన మంగళవారం నెల్లూరులో, బుధవారం నాయుడుపేటలో ఉన్నారు.



సత్యవేడులో అనారోగ్యంతో బాధపడుతున్న జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సుందరరామిరెడ్డిని పరామర్శిస్తున్న ఆదిమూలం



తిరుపతిలో సత్యవేడు నాయకులతోపాటు మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన రాజేశ్

- సత్యవేడు టీడీపీ అభ్యర్థి కోనేటి ఆదిమూలం పోలింగ్ ముగిశాక పుత్తూరు శివార్లలోని స్వగృహంలోనే ఉంటున్నారు. రోజువారీ నియోజకవర్గంలో పర్యటిస్తూ కేడర్‌ను కలుసుకుంటున్నారు. బుధవారం ఆయన సత్యవేడు, పిచ్చాటూరుల్లో పర్యటించారు.
- సత్యవేడు వైసీపీ అభ్యర్థి నూకతోటి రాజేశ్ పోలింగ్ తర్వాత నియోజకవర్గంలో అడుగుపెట్టలేదు. ఆయన తిరుపతిలో ఉంటూ నాయకులను, కార్యకర్తలను అక్కడే కలుస్తున్నారు. బుధవారం రాజేశ్ మంత్రి పెద్దిరెడ్డిని కలిశారు.



పులివర్తి నానీని పరామర్శిస్తున్న కృష్ణా జిల్లా తిరువూరు టీడీపీ అభ్యర్థి కొలికపూడి శ్రీనివాసరావు



సప్తగిరి కాలనీ ఉప సర్పంచ్ అశోక్ రెడ్డి తండ్రి మృతికి నివాళి అర్పించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి, మోహిత్ రెడ్డి

- చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని తిరుపతి శివార్లలోని తన నివాసంలో ఉంటున్నారు. నియోజకవర్గంతో పాటు పలు ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న పార్టీ నాయకులను, ఇతర ముఖ్యులను కలుస్తున్నారు. బుధవారం నానీని కృష్ణా జిల్లా తిరువూరు టీడీపీ అభ్యర్థి కొలికపూడి శ్రీనివాసరావు కలసి పరామర్శించారు.
- చంద్రగిరి వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పోలింగ్ ముగిశాక తుమ్మలగుంటలోని స్వగృహంలోనే ఉంటున్నారు. కేడర్‌ను కలుస్తున్నారు.తిరుపతి రూరల్ మం డలం మంగళం పరిధిలోని సప్తగిరి కాలనీ ఉప సర్పంచ్ అశోక్‌రెడ్డి తండ్రి ఇటీవల మృతి చెందగా బుధవారం వారి నివాసానికి వెళ్లి కుటుంబీకులను మోహిత్ పరామర్శించారు.

- తిరుపతి జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు పోలింగ్ ముగిశాక కూడా తిరుపతిలోనే ఉంటున్నారు. బుధవారం ఆయన్ను జనసేన నేత హరిప్రసాద్, రిటైర్డు ఉద్యోగులు కలిశారు.



విశ్రాంత ఉద్యోగులతో ఆరణి శ్రీనివాసులు

- తిరుపతి వైసీపీ అభ్యర్థి భూమన అభినయ్ రెడ్డి కూడా పోలింగ్ ముగిశాక తిరుపతిలోనే కేడర్‌కు అందుబాటులో ఉన్నారు. గంగజాతరలో బిజీగా గడిపిన ఆయన జాతర ముగియడంతో బుధవారం నివాసంలోనే గడిపారు.



ఆలయం ముందు కుటుంబ సభ్యులతో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి

శ్రీవారి సేవలో తెలంగాణ సీఎం

ఆలయంలో 45 నిమిషాలు గడిపిన రేవంత్‌రెడ్డి

తిరుమల, మే 22 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారిని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దర్శించుకున్నారు. సీఎం హోదాలో తొలిసారిగా తన సతీమణి, కుమార్తె, అల్లుడు, కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం రాత్రి తిరుమలకు చేరుకున్న ఆయన బుధవారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకున్నారు. అంతకుముందు మనవడి పుట్టెంట్రుకల మొక్కుకుని సమర్పించారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో సామాన్య భక్తుడిలా క్యూలైన్ ద్వారా ఆలయంలోకి 8.30 గంటలకు వెళ్లారు. అనంతరం ఆలయంలోనే సుమారు 45 నిమిషాలు గడిపారు. కాగా, దర్శనం పూర్తయి అతిథి గృహానికి చేరుకునే వరకు తన మనవడిని ఎత్తుకునే కనిపించారు రేవంత్‌రెడ్డి. దర్శనానంతరం ఆలయం వెలుపలకు వచ్చినప్పుడైతే భుజంపై ఎత్తుకుని సంబరపడ్డారు. ఆలయం ముందు కొంతదూరం చేయిపట్టుకుని నడిపించారు కూడా.వాహనం ఎక్కే సమయంలో దగ్గరికి వచ్చిన అభిమానులతో ఓపిగ్గా ఫొటోలు దిగారు. అతిథిగృహానికి చేరుకుని 9.50 గంటలకు తిరుగు ప్రయాణమయ్యారు.

విద్యుదాఘాతంతో గూడబాతు మృతి

- కళేబరం తీగలకు చిక్కుకోవడంతో 4గంటలపాటు విద్యుత్ అంతరాయం

దొరవారిసత్రం, మే 22: గూడబాతు (పెలికాన్ పక్షి) ఒకటి విద్యుదాఘాతంతో మృతి చెందింది. దొరవారిసత్రం మండలంలోని వడ్డిపాళెం సమీపంలో ఈ ఘటన జరిగింది. పులికాట్ సరస్సులో సేద దీరే ఈ పక్షి ఆకాశంలో వెళుతూ బుధవారం ఉదయం ఏడు గంటల ప్రాంతంలో వడ్డిపాళెం సమీపంలో విద్యుత్ వైర్లకు చిక్కుకుంది. అనంతరం షార్ట్‌సర్క్యూట్ కావడంతో మృతి చెందింది. ఈ ఘటనలో కళేబరం తీగల మధ్యే ఉండటంతో దొరవారిసత్రం, గోకుల క్రిష్ణ కాలేజి సమీపంలో రెండు చోట్ల 33-11 కేవీ విద్యుత్ వైర్లు తెగిపోయాయి. అలాగే మన్నారుపోలూరు 22 కేవీ లైన్ ఇన్సులేటర్ ధ్వంసమైంది. దీంతో దొరవారిసత్రం, తల్లంపాడు, పూలతోట సబ్‌స్టేషన్లకు విద్యుత్ సరఫరా ఆగిపోయింది. దీంతో ట్రాన్స్‌కో సిబ్బంది వచ్చి కళేబరాన్ని తొలగించి, ఉదయం 11 గంటల సమయంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. అనంతరం పక్షి కళేబరాన్ని నేలపట్టు పక్షుల కేంద్ర అధికారులకు అప్పగించారు. వారు దాని పూడ్చి పెట్టారు.



గూడబాతు కళేబరం

ప్రకాశంకాలనీలో కార్డన్ సెర్చి



స్వాధీనం చేసుకున్న వాహనాలతో సీఐ తదితరులు

కోట, మే 22 : మండల పరిధిలోని గూడలి పంచాయతీలో గల ప్రకాశం కాలనీ, చెందోడు పంచాయతీలలో గల ఎన్టీఆర్ కాలనీలలో బుధవారం కోట పోలీసుల ఆధ్వర్యంలో కార్డన్ సెర్చి జరిగింది. వాకాడు సీఐ హరికృష్ణ, కోట ఎస్ఐ నాగబాబు ఆధ్వర్యంలో ఆయా కాలనీల్లో తెల్లవారుజామునుంచే ఈ సోదాలు జరిగాయి. సరైన రికార్డులు లేని 20 ద్విచక్రవాహనాలు, 7 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం స్థానికులతో సమావేశమై ఓట్ల లెక్కింపు సందర్భంగా 144 సెక్షన్ అమలులో ఉందని అతిక్రమించరాదన్నారు.

తేలికపాటి వర్షం



గూడూరు, మే 22: పట్టణంలో బుధవారం ఉదయం అరగంట పాటు తేలికపాటి వర్షం కురిసింది. అల్పపీడనం కారణంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ఇప్పటికే తెలిపింది. ఈ క్రమంలో ఉదయం 8గంటలకు వర్షం కురిసింది. అనంతరం ఎండ కాయడంతో భిన్న వాతావరణం కారణంగా ఉక్కపోతతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.

పేదలకు దుస్తుల పంపిణీ



గూడూరు అర్బన్, మే 22: స్థానిక బాలాజీనగర్‌లోని ప్రగతి సేవా సంస్థ కార్యాలయంలో బుధవారం సేవాసంస్థ ఆధ్వర్యంలో రమేష్ దాతృత్వంతో పేదలకు దుస్తులు, ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కె.చంద్రశేఖర్, శ్రీనివాసులు, యామిని, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

గూడూరు అర్బన్, మే 22: స్థానిక సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో బుధవారం ఆంధ్రమహిళా మండలి, ఇన్నర్ వీల్‌క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం జరిగింది. కార్యక్రమంలో డాక్టర్ రోహిణి, స్నేహలత తదితరులు పాల్గొన్నారు.

పాశిం సునీల్‌కుమార్ గెలుపు కాంక్షిస్తూ...

ఛాతిపై పచ్చబొట్టు



వాకాడు, మే 22 : గూడూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పాశిం సునీల్‌కుమార్ ఎన్నికల్లో గెలుపొందాలంటూ వాకాడు మండలం నిడిగుర్తి పంచాయతీ రెడ్డిపాళేనికి చెందిన తీపలపూడి అన్వేష్ బుధవారం తన ఛాతిపై పచ్చబొట్టు వేసుకున్నాడు. రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా పీఠాన్ని ఎక్కాలని, గూడూరు నియోజకవర్గంలో పాశిం గెలవాలని వాకాడు మండలంలోని యువత అంతా ఎదురుచూస్తున్నామన్నారు.

బైక్‌ను ఢీ కొన్న లారీ: మోటర్ సైక్లిస్టు మృతి



నాగులు (ఫైల్‌ఫొటో)

నాయుడుపేట టౌన్, మే 22: నాయుడుపేట - మేనకూరు సెజ్ ప్రాంతంలో బైక్‌ను లారీ ఢీ కొన్న సంఘటనలో మోటరు సైకిలిస్టు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు ఓజిలి మండలం తిరుమలపూడి గ్రామానికి చెందిన నాగులు(30) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో అత్తగారిల్లైన భీమవరానికి తిరుమల పూడి నుంచి బైక్‌పై బయలుదేరాడు. మేనకూరు సమీపంలోకి రాగానే లారీ ఢీ కొనడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా నాగులుకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

పరిహారం కోసం రైతుల నిరసన



సాగరమాల రోడ్డు పనుల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

చిల్లకూరు, మే 22: మండలంలోని చింతవరానికి చెందిన పలువురు రైతులు తమకు పరిహారం ఇవ్వాలని బుధవారం సాగరమాల రోడ్డు పనుల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ... తమకు ప్రభుత్వం సీజేఎఫ్ఎస్ పట్టాలను మంజూరు చేసిందన్నారు. వాటిలో సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. అయితే ఆ భూములను సాగరమాల ప్రాజెక్టు కోసం తీసుకున్నారే కానీ తమకు ఏలాంటి పరిహారం ఇవ్వలేదన్నారు. అయితే సీజేఎఫ్ఎస్ భూములకు కొందరికి పరిహారం ఇచ్చారని తమకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. అధికారులు తమకు పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు.

టీడీపీ నాయకుడికి అశ్రు నివాళి

డక్కిలి, మే 22: టీడీపీ నాయకుడు చెలికం భాస్కరరెడ్డి గుండెపోటుతో మృతి చెందడం పార్టీకి తీరని లోటని తిరుపతి పార్లమెంటు ఉపాధ్యక్షులు పి.రాజేశ్వరరావు,తెలుగుయువత రాష్ట్ర ప్రచార కార్యదర్శి కేవీకే ప్రసాద్ నాయుడు అన్నారు. బుధవారం భాస్కరెడ్డి భౌతికకాయానికి నివాళి అర్పించారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఏ.రామచంద్రయ్య నాయుడు, మాజీ ఎంపీపీ పి.వెంకటరెడ్డి సహా పలువురు టీడీపీ నాయకులు నివాళి అర్పించారు.

గురుకుల కళాశాలలో ప్రవేశాలకు కౌన్సెలింగ్

కోట, మే 22: మండల పరిధిలోని చిట్టేడు యానాదుల గురుకుల కళాశాలలో బుధవారం జూనియర్ ఇంటర్‌లో ప్రవేశానికి సంబంధించి కౌన్సెలింగ్ జరిగింది. 150 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇక్కడ కళాశాలలోని మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, ఒకేషనల్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులను మెరిట్ ఆధారంగా 120 మందిని ఎంపిక చేశారు. ఐటీడీఏ జిల్లా అధికారి సూర్యనారాయణరావు మాట్లాడుతూ... గురుకులాల్లో కార్పొరేట్ స్థాయికి మించి విద్యాబోధన జరుగుతుందన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ శేషవర్ధన్ ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

విధుల్లో చేరిన పారిశుధ్య కార్మికులు

కోట, మే 22: పంచాయతీ పారిశుధ్య కార్మికులు బుధవారం ఎట్టకేలకు విధుల్లో చేరారు. చెత్తను తరలించే విషయంలో స్థానికంగా ఉన్న గిరీష్ అనే యువకుడు వాగ్వాదానికి దిగి ముగ్గురు పారిశుధ్య కార్మికులపై దాడి చేయడంపై పోలీసులు కేసు నమోదు చేయడంతో విధులకు హాజరయ్యారు. పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో చెత్త ఎత్తే కార్యక్రమంలో నిమగ్నమయ్యారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ధనలక్ష్మి

నాయుడుపేట, మే 22: వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్టు ఎంపీపీ కురుగొండ్ల ధనలక్ష్మి చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ... సీజనల్ వ్యాధులు ప్రబలకుండా కూడా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చప్టాల అభివృద్ధికి చర్యలేవి?

హైలెవల్ వంతెన నిర్మాణానికి నోచుకోని తిప్పగుంటపాళెం చప్టా ● అవస్థల్లో ఆయా గ్రామాల ప్రజలు



హై లెవెల్ వంతెనకు నోచుకోని తిప్పగుంటపాళెం చప్టా



అభివృద్ధికి నోచుకోని పారిచెర్లవారిపాళెం చప్టా

చిల్లకూరు, మే 22: మండలంలోని పలు చప్టాలు అభివృద్ధికి నోచుకోకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని తిప్పగుంటపాళెం, పారిచెర్లవారిపాళెం, నెలబల్లిరెట్టపల్లి, తిమ్మనగారిపాళెం గ్రామాల సమీపంలో చప్టాలున్నాయి. ఆయా చప్టాలు ఏళ్ల తరబడి అభివృద్ధి జరగక అధ్వానంగా మారాయి. ప్రధానంగా తిప్పగుంటపాళెం లోని ఉప్పుటేరుపై ఉన్న చప్టా అభివృద్ధి జరగకపోవడంతో గ్రామస్తులు వర్షాకాలంలో తీవ్ర అవస్థలు పడుతున్నారు. యేటా వర్షాల సమయంలో నీటి ప్రవాహం పెరిగి చప్టాపై నీరు ప్రవహిస్తుంది. దీంతో గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుని బయట ప్రపంచానికి సంబంధం లేకుండా పోతుంది. వాన తగ్గుముఖం పట్టాక ఏరు దాటేందుకు మరబోట్ల ద్వారా రాకపోకలు సాగించాల్సి వస్తుంది. ఈ ఉప్పుటేరుపై హై లెవల్ వంతెన నిర్మించాలని చాలా యేళ్లుగా గ్రామస్తులు కోరుతున్నారు. పారిచెర్లవారిపాళెం, నెలబల్లిరెట్టపల్లి, తిమ్మనగారిపాళెంల సమీపంలోని చప్టాలు పరిస్థితి కూడా ఇంతే. అధికారులు ఆయా చప్టాలపై హై లెవల్ వంతెనలు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తవ్వారు... వదిలేశారు!





ఇలుపూరు వద్ద రోడ్డును ఆనుకొని తవ్విన గుంత - వెంగలాపురం వద్ద తవ్వి వదిలేసిన గుంత

సూళ్లూరుపేట, మే 22: టిడ్కో ఇళ్లకు నీటి సరఫరా కోసం తవ్విన గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరు సమీపంలో శ్రీకాళహస్తి రోడ్డు వద్ద టిడ్కో ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. ఎన్నికల కోడ్ రాకముందు హడావిడిగా ఆ సముదాయానికి తాగునీరు అందించేందుకు రూ.12.65 కోట్లతో కాళంగి నది నుంచి పైపులైన్ల ఏర్పాటు పనులు ప్రారంభించారు. వెంగలాపురం వద్ద కాళంగి నుంచి పైపులైన్ వేసేందుకు ఇలుపూరు-మంగళంపాడు రోడ్డును అనుకుని ఎక్స్‌కవేటర్ సాయంతో గుంతలు తవ్వారు. పైపులు పూడ్చారే కాని పలుచోట్ల గుంతలు అలాగే వదిలేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు కూడా పట్టించుకోవడం లేదు. రోడ్డుకు పక్కనే తవ్విన గుంతలు అలాగే వదిలేయడంతో రెండు వాహనాలు ఎదురెదురు వచ్చినప్పుడు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ మార్గంలో పరిశ్రమలకు వెళ్లే బస్సులతో పాటు ఆర్టీసీ బస్సులు, ఆటోలు రాకపోకలు సాగిస్తుంటాయి. వారం రోజుల క్రితం శ్రీసిటిలో ఓ పరిశ్రమకు కార్మికులను తీసుకెళ్లే బస్సు ఆ గుంతలో ఇరుక్కుపోయింది. ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గుంతలు పూడ్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రతిభ చాటిన విద్యార్థినికి బంగారు పతకం



గవర్నర్ చేతులమీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న ప్రిస్కిల్లా, డాక్టరేట్ అందుకుంటున్న పీరకుమార్

గూడూరు, మే 22: విక్రమ సింహపురి యూనివర్సిటీలో బుధవారం జరిగిన స్నాతకోత్సవంలో గూడూరు చర్చి కాంపౌండ్‌కు చెందిన విద్యార్థినీ ప్రిస్కిల్లా బంగారు పతకం అందుకుంది. 2021 సంవత్సరంలో విక్రమసింహపురి వర్సిటీలో ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ చదివిన ప్రిస్కిల్లా... 9.83 జీపీఏ సాధించింది. దీంతో గవర్నర్ అబ్దుల్‌నజీర్ చేతులమీదుగా బంగారు పతకంతోపాటు ప్రశంసాపత్రాన్ని అందుకుంది.

అర్థశాస్త్ర అధ్యాపకుడికి డాక్టరేట్

గూడూరు పట్టణంలోని ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్రంలో అధ్యాపకుడు బద్రి పీరకుమార్ విక్రమసింహపురి యూనివర్సిటీ నుంచి డాక్టరేట్‌ను అందుకున్నారు. బుధవారం నెల్లూరులో విక్రమసింహపురి వర్సిటీలో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్‌నజీర్ చేతులమీదుగా డాక్టరేట్‌ను అందుకున్నారు. 'ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాన పంటలు - వృద్ధి, అస్థిరత, సరఫరా ప్రతిస్పందనలు - అధ్యయనం'పై ప్రొఫెసర్ ఎన్ఆర్‌పీ రమణారెడ్డి మార్గదర్శకత్వంలో పరిశోధనకు డాక్టరేట్‌ను అందుకున్నారు.

15 పంచాయతీల్లో ఉపాధి పనులకు బ్రేక్?

ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్న ఏపీవో



సిబ్బందికి సూచనలిస్తున్న ఏపీవో పూర్ణిమ

కోట, మే 22: మండలంలోని 21 పంచాయతీలకు గాను 15 పంచాయతీల్లో కూలీలకు పనులు లేవని తేల్చారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఏపీవో పూర్ణిమ ఆధ్వర్యంలో ఉపాధి హామి పథక పనులపై సమీక్షా సమావేశం జరిగింది. ఏడు పంచాయతీల్లో ఎన్నికల కౌంటింగ్ ముందు 93 పనులకు ప్రతిపాదనలు పంపినప్పటికీ మంజూరు కాలేదు. మరో 8 పంచాయతీల్లో పనులు లేకపోవడంతో కొన్నింటికి మాత్రమే డ్వామా అధికారులకు మంజూరు కోసం ప్రతిపాదనలు పంపినట్లు తెలిపింది. ప్రస్తుత వేసవిలో కూలీలకు పనులు లేకపోతే జీవనోపాధి కష్టతరమవుతుందన్న నేపథ్యంలో టెక్నికల్ అసిస్టెంట్లు క్షేత్రసహాయకులతో ఏపీవో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. పనులు సత్వరం మంజూరయ్యేందుకు పంచాయతీల వారీగా ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధంచేసే పనుల్లో క్షేత్ర సహాయకులు నిమగ్నమయ్యారు.

ఆంధ్రప్రదేశా... ఆఫ్ఘనిస్తానా: బీజేపీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 22: రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులను చూస్తే ఆఫ్ఘనిస్తాన్‌లో ఉన్నామా అనే అనుమానం కలుగుతోందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో వైసీపీ చేసిన అరాచకాలకు సంబంధించిన 400 వీడియోలు ఇంటర్‌నెట్‌లో ఉన్నాయని చెప్పారు.మాచర్ల, పల్నాడు, తాడిపత్రి, చంద్రగిరి ప్రాంతాల్లో వైసీపీ అరాచకాన్ని తెలుపుతున్నాయన్నారు.స్ట్రాంగ్ రూంల వద్ద పరిస్థితి ఇలా ఉంటే ప్రజాస్వామ్యానికి అర్థం ఏముందన్నారు.

కౌంటింగ్ సందర్భంగా

అల్లర్లకు పాల్పడితే చర్యలు: డీఎస్పీ




గ్రామస్తులకు సూచనలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు రెడ్డి

దొరవారిసత్రం, మే 22: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని నాయుడుపేట డీఎస్పీ శ్రీనివాసులు రెడ్డి హెచ్చరించారు. బుధవారం రాత్రి ఆయన సింగనాలత్తూరులో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. ఫలితాలు వెలువడిన తరువాత కూడా సంబరాలు, ర్యాలీలు నిర్వహించరాదన్నారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి సహకరించాలన్నారు. ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయుడుపేట సీఐ జగన్మోహనరావు, ఎస్ఐ తిరుమలరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వెంగమాంబ బృందావనంలో పుష్పాంజలి

తిరుమల, మే 22 (ఆంధ్రజ్యోతి): 18వ శతాబ్దపు వేంకటేశ్వరస్వామి పరమ భక్తుల్లో ఒకరైన మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ 294వ జయంతిని పురస్కరించుకుని తిరుమలలోని వెంగమాంబ బృందావనంలో బుధవారం టీటీడీ వెంగమాంబ ప్రాజెక్ట్ సంచాలకులు భూమన్ సుబ్రహ్మణ్యంరెడ్డి పుష్పాంజలి సమర్పించారు. ఆయన మాట్లాడుతూ వెంగమాంబ వేంకటేశ్వరుడు, తరిగొండ లక్ష్మీనృసింహస్వామిపై గొప్ప రచనలు చేశారన్నారు. వెంగమాంబ ప్రాజెక్ట్ ద్వారా టీటీడీ ఆమె సాహిత్యాన్ని ప్రచారం చేస్తూ, ప్రతి ఏడాది తరిగొండ, తిరుపతి, తిరుమలలో జయంతి ఉత్సవాలను నిర్వహిస్తోందన్నారు. శ్రీవారికి ఏకాంతసేవ సమయంలో అన్నమయ్యలాలి-వెంగమాంబ ముత్యాలహారతి నేటికీ కొనసాగుతున్నాయన్నారు. నాదనీరాజనం వేదికపై టీటీడీ ఆస్థాన విద్వాంసుడు బాలకృష్ణప్రసాద్ వీనులవిందుగా ఆలపించారు.







పెంచలకోన బ్రహ్మోత్సవాల్లో భాగంగా దాతలు చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ వైద్యులతో పాటు రాపూరుకు చెందిన ఆర్ఎంపీలు ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించారు. పెంచలకోన రోడ్డు మార్గంలో అక్కడక్కడా దాతలు చలివేంద్రాలు ఏర్పాటు చేసి భక్తుల దాహార్తి తీర్చారు. అలాగే అన్నదానాలు జరిగాయి. కాగా స్వామివారిని దర్శించుకున్న ప్రముఖుల్లో ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్, శాస్త్రవేత్త డాక్టర్ జి.సతీష్ రెడ్డి వున్నారు.

- డక్కిలి

వైభవం... లక్ష్మీనరసింహుడి కల్యాణం



బాలాయపల్లి, మే 22: మండలంలోని అలిమిలి పంచాయతీలో కనుమరాయ కొండపై కొలువై ఉన్న లక్ష్మీనరసింహుడి ఆలయంలో స్వామి వారి కల్యాణం కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని కల్యాణ ఘట్టాన్ని తిలకించి పునీతులయ్యారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ మహబూబ్ సుబానిబందోబస్తు నిర్వహించారు.

నేత్రపర్వంగా లక్ష్మీనరసింహస్వామి జయంతి



ప్రత్యేక అలంకరణలో స్వామి - నృసింహుడి కల్యాణం - చందనాలంకారం

వెంకటగిరిటౌన్, మే 22: స్థానిక వల్లివేడు సమీపంలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి 64వ జయంతి వేడుకలు బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో సుప్రభాతం, స్వామివారికి అభిషేకం, కళ్యాణం నిర్వహించారు. పట్టణంలోని ప్రముఖులు వచ్చి కళ్యాణంలో పాల్గొన్నారు. విశేష పూజలు నిర్వహించి ప్రసాదాలు స్వీకరించారు. ప్రతి ఏటా స్వామివారి జయంతి సందర్భంగా 9వ బెటాలియన్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం చందనాలంకారం, భజన, గరుడోత్సవం చేసి భక్తులకు కనువిందు చేసింది.

విజయదుర్గాదేవికి చందనాభిషేకం



గూడూరు, మే 22: పట్టణంలోని సాయిసత్సంగ నిలయంలోని విజయదుర్గాదేవి ఉపపీఠంలో బుధవారం 16వ వార్షికోత్సవ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం విజయదుర్గాదేవికి, లక్ష్మీనరసింహస్వామి జయంతి సందర్భంగా లక్ష్మీనరసింహస్వామికి చందనాభిషేకం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి మహానవావరణ హోమపూజలను శాస్త్రోపేతంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. కార్యక్రమంలో నిర్వాహకుడు కోట సునీల్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

గరుడుడిపై నరసింహుడి విహారం



చిల్లకూరు, మే 22: మండలంలోని కలవకొండలో కొలువై ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి గరుడ వాహనంపై అధిష్ఠింపజేసి విశేషపూజలు జరిపారు. ఆలయ ఆవరణలో గరుడాదీశుడైన స్వామివారిని ఊరేగించారు. భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది.

హనుమంతుడిపై కరిమాణిక్యస్వామి పుర విహారం



నాయుడుపేట టౌన్, మే 22: నాయుడుపేట తుమ్మూరులో కొలువై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత కరిమాణిక్యస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం తిరిచ్చి ఉత్సవం, రాత్రి హనుమంత వాహన సేవ జరిగాయి. ఉభయదారులుగా పసల గంగాప్రసాద్, సువర్ణ దంపతులు వ్యవహరించారు. ఏర్పాట్లను టీటీడీ ఇన్‌స్పెక్టర్లు సుధీర్, హరి సహా సిబ్బంది పర్యవేక్షించారు.



మన్నూరు రోడ్డు సమీపంలో చికెన్ వ్యర్థాలు

రోడ్ల వెంబడి చికెన్ వ్యర్థాలు

పట్టించుకోని అధికారులు



బాలాయపల్లి, మే 22: చికెన్ వ్యాపారులు కోళ్ల వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పడేస్తుండడంతో దుర్గంధం వెదజల్లుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గూడూరు - వెంకటగిరి మార్గంలో వెంకటగిరి నుంచి గూడూరు వరకు రోడ్ల వెంబడి చికెన్ వ్యర్థాలు కుప్పగా పోసేస్తుండడంతో డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు దుర్గంధం భరించలేక ముక్కుమూసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. దీనిపై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ప్రజలు వాపోతున్నారు. అయితే పోలీసులకు ఫిర్యాదు చేయగా చికెన్ వ్యాపారులను హెచ్చరించి వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకున్నారు. మళ్లీ షరా మామూలైపోయింది. యథావిధిగా వ్యర్థాలను పడేస్తున్నారు. ఈ రోడ్డు వెంబడి ఎంతో మంది అధికారులు వెళ్తున్నా చికెన్ వ్యర్థాల గుట్టలపై దృష్టి సారించేవారు కరువయ్యారని అంటున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి చికెన్ వ్యాపారులపై చర్యలు తీసుకుని వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.